

పీజీ ఫలితాలు విడుదల

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో పీజీ 2, 4 సెమిస్టర్ల పరీక్షల ఫలితాలను ఉపకులపతి పీఎస్ షావలి ఖాన్ విడుదల చేశారు. మంగళవారం తన చాంబర్లో రిజిస్ట్రార్ లోక్‌నాథ్‌తో కలిసి మాట్లాడుతూ ఫలితాలను వెబ్‌సైట్‌లో ఉంచుతున్నట్లు తెలిపారు. ఏప్రిల్‌లో ఎంఏ ఉర్దూ, ఇంగ్లీష్, ఎకనామిక్స్, ఎంఎస్సీ కంప్యూటర్ సైన్సు, ఎంఎస్సీ కెమిస్ట్రీ, ఎంబీఏ, ఎంసీఏ పరీక్షల ఫలితాలను వెల్లడించారు.

సర్టిఫికెట్ల పరిశీలన

● 70 మంది అభ్యర్థులకు కాల్ లెటర్స్ జారీ



డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న విద్యాశాఖ అధికారులు

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీకి సంబంధించిన రెండో విడత సర్టిఫికెట్ల పరిశీలన మంగళవారం రాయలసీమ విశ్వవిద్యాలయంలోని లైబ్రరీ బిల్డింగ్‌లో చేపట్టారు. మొదటి విడత సర్టిఫికెట్ల పరిశీలనలో తిరస్కరణకు గురైన వారి స్థానంలో కొత్త ఉపాధ్యాయ అభ్యర్థులు, గతంలో వివిధ కారణాలతో కాల్ లెటర్స్ రాకుండా మిగిలిన పోస్టులకు గానూ 70 కాల్ లెటర్స్ జారీ అయ్యాయి. ఇందులో లోకల్ అభ్యర్థులు 46 మంది కాగా, నాన్ లోకల్ కేటగిరిలో ఎంపికైన 24మంది అభ్యర్థులు ఉన్నారు. ఉపాధ్యాయ సర్టిఫికెట్ల పరిశీలన బుధవారం వరకు కొనసాగుతుంది. ఇందుకోసం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో రెండు బృందాలను ఏర్పాటు చేశారు. డీఈవో శామ్యూల్ పాల్ ఆధ్వర్యంలో కార్యాలయ ఏడీ నాగభూషణం, సూపరింటెండెంట్లు, మండల విద్యాశాఖ అధికారులు, కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నకిలీ వైకల్య నిర్ధారణ సర్టిఫికెట్లు

మెగా డీఎస్సీ మొదటి విడత సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసుకుని మెడికల్ బోర్డుకు హాజరైన వినికిడి లోపం, అంధత్వ నకిలీ ధ్రువపత్రాలు బయటపడినట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఇందులో ఐదుగురు వినికిడి లోపం, అంధత్వ అభ్యర్థులు బోగస్ సర్టిఫికెట్లను సమర్పించినట్లు మెడికల్ బోర్డు జిల్లా విద్యాశాఖ అధికారులకు నివేదికలు పంపినట్లు తెలిసింది.



రైతులకు వరం కపాస్ కిసాన్ యాప్

- **పత్తి కొనుగోలు చేసేందుకు సీసీఐ చొరవ**
- **క్వింటానికి రూ.8,110లు మద్దతు ధర**
- **దళారుల నుంచి విముక్తి కల్పించడానికి చర్యలు**

రాష్ట్రంలోనే పత్తి పంట సాగులో మొదటి స్థానంలో ఉన్న ఉమ్మడి కర్నూలు జిల్లా రైతులకు పత్తి కొనుగోలులో ఈ సంవత్సరం అత్యధికంగా ప్రయోజనాన్ని కల్పించేందుకు సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) సంస్థ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. క్వింటానికి రూ.8,110లు మద్దతు ధర రైతులకు అందనుంది. పత్తి రైతుల కోసం కపాస్ కిసాన్ యాప్‌ను కేంద్ర ప్రభుత్వం రూపొందించింది. ఈ యాప్‌తో రైతులకు దళారుల నుంచి విముక్తి కలుగుతుంది. కనీస మద్దతు ధర పొందాలంటే ఈ యాప్‌లో రిజిస్టర్ అయిన రైతులు పత్తి విక్రయ సమయంలో స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. ఏరోజు సీసీఐ కేంద్రంలో ఆ రైతులు విక్రయించాలో వివరాలు తెలుపుతూ సీసీఐ అధికారులు, యాప్ ద్వారా సమాచారాన్ని అందిస్తారు. ఇలా చేయడంతో పత్తిని అమ్ముకునేందుకు సీసీఐ కేంద్రాల వద్ద రైతులు రోజుల తరబడి నిరీక్షించాల్సిన బాధ తప్పుతుంది.

కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కపాస్ (పత్తి) రైతుల కోసం కపాస్ కిసాన్ యాప్‌ను కేంద్ర ప్రభుత్వం రూపొందించింది. రైతులు కేంద్రం ప్రకటించిన క్వింటానికి రూ.8,110లు అందుకునే అవకాశాన్ని సీసీఐ(కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) ఈసారి కల్పించింది. ఇందులో భాగంగా ప్రతి పత్తి రైతు మద్దతు ధరను అందుకు నేందుకు ఈయాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. పంట పండించే రైతులు తమపేర్లను సెప్టెంబరు 1నుంచి 30వ తేదీ వరకు ఈయాప్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. అలా నమోదు చేసుకున్న వారే సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో తమ సరుకును విక్రయించుకునే అవకాశం ఉంటుంది. ఈ నూతన కార్యక్రమంపై రైతుల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని సీసీఐ ఉన్నతాధికారులు మార్కెటింగ్, వ్యవసాయ శాఖల యంత్రాంగాలకు సమాచారాన్ని అందజేశారు.

యాప్ ద్వారా ప్రయోజనం ఇలా

ప్రతి పత్తి రైతు తన వద్దఉన్న పత్తిని నేరుగా సీసీఐ కేంద్రంలోనే అమ్ముకునేందుకు ఈ కపాస్ కిసాన్ యాప్‌ను కచ్చితంగా డౌన్‌లోడు చేసుకోవాలి. ఆ రైతుకు సంబంధించి భూమి రికార్డులు, రెవెన్యూ శాఖ అధికారుల ద్వారా ధ్రువీకరించిన పత్తి పంట రికార్డు, ఆధార్ కార్డు వివరాలు ఈ యాప్‌లో నమోదు చేయాలి. ఫలితంగా ఉమ్మడి జిల్లాలో పత్తి రైతులు పంట విస్తీర్ణం, సాంద్రత వివరాలన్నీ సీసీఐ అధికారులకు నేరుగా అందుతాయి. ఈనెలాఖరుకు రైతులు ఈయాప్‌లో రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుందని సీసీఐ అధికారులు చెబుతున్నారు.

దళారుల నుంచి విముక్తి

గత ఏడాది క్వింటాం పత్తికి సీసీఐ రూ.7,520లు ధర చెల్లించింది. మార్కెటింగ్ శాఖ అధికారుల సహకారంతో దళారులు రైతులకు తక్కువ ధరను చెల్లించి ఆ పత్తిని వారే సీసీఐ కేంద్రాలకు తీసుకెళ్లి మద్దతు ధర పొంది పెద్ద ఎత్తున లాభపడ్డారు. గత సంవత్సరం ఖరీఫ్‌లో సాగైన పత్తికి సంబంధించి దాదాపు రూ.235 కోట్ల దాకా సీసీఐ కొనుగోలు చేసింది. ఇందులో కనీసం 30 శాతానికి మించి రైతుల నుంచి కొనుగోలు చేయలేదు. మిగిలిన 70 శాతం పత్తిని దళారులే సీసీఐకు అమ్మి లాభపడ్డారు. ఈ ఏడాది ఆ పరిస్థితులు తలెత్తకుండా దళారుల ప్రమేయం లేకుండా సీసీఐ సంస్థకు రైతులే నేరుగా పత్తిని అమ్ముకునే విధంగా ఏర్పాట్లను చేపట్టింది. ఈ సంవత్సరం క్వింటం పత్తికి రూ.8,110లు మద్దతు ధరను ప్రకటించింది. గత సంవత్సరం పోలిస్తే క్వింటానికి రూ.500 పెంచింది. కనీస మద్దతు ధర పొందాలంటే ఈ యాప్‌లో రిజిస్టర్ అయిన రైతులు పత్తి విక్రయ సమయంలో స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. ఏరోజు సీసీఐ కేంద్రంలో ఆ రైతులు విక్రయించాలో వివరాలు తెలుపుతూ సీసీఐ అధికారులు, యాప్ ద్వారా సమాచారాన్ని అందిస్తారు. ఇలా చేయడం వల్ల పత్తిని అమ్ముకునేందుకు సీసీఐ కేంద్రాల వద్ద రైతులు రోజుల తరబడి నిరీక్షించాల్సిన బాధ తప్పుతుంది. స్లాట్ బుక్ చేసుకునే వారికి మాత్రమే ఈ వెసులుబాటు ఉంటుంది.

ప్రతి రైతు యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి



పత్తి రైతులకు సీసీఐ సంస్థ అమలులోకి తెచ్చిన కపాస్ కిసాన్ యాప్ ఒక సువర్ణావకాశం వంటిదే. దళారులను ఆశ్రయించి మోసపోవాల్సిన అవసరం ఉండదు. ఇప్పుడే ప్రతి పత్తి రైతు కపాస్ కిసాన్ యాప్‌ను డౌన్‌లోడు చేసుకుని పంట సాగుకు సంబంధించిన వివరాలు నమోదు చేసుకోవాలి. ఈ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి.

● నారాయణమూర్తి, ఏడీఎం, కర్నూలు



బూటు కాలితో తన్ని బండ బూతులు తిట్టి..!

- **ఆటో డ్రైవర్‌పై ఎమ్మిగనూరు సీఐ దాష్టీకం**
- **వినాయక నిమజ్జనోత్సవంలో అమానవీయ ఘటన**



యువకుడిపై చేయి చేసుకుంటున్న సీఐ

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆయన ఓ బాధ్యతగల సర్కిల్ ఇన్‌స్పెక్టర్. ఎవరైనా తప్పు చేస్తే హెచ్చరించాలి.. లేదంటే అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించాలి. కానీ ఎమ్మిగనూరు పట్టణ సీఐ తీరు మాత్రం భిన్నంగా మారింది. ఓ సామాన్య ఆటో డ్రైవర్‌పై బూటు కాలితే పదే పదే తన్ని, పత్రికలో రాయలేని బండబూతులు తిట్టి తన దాష్టీకాన్ని ప్రదర్శించారు. ఈ అమానవీయ ఘటన ఎమ్మిగనూరు పట్టణంలో ఆగస్టు 31వ తేదీన చోటు చేసుకుంది. అయితే ఇందుకు సంబంధించిన వీడియో మంగళవారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. గతనెల 29న పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో నిమజ్జనం పూర్తయింది. కానీ ఎమ్మిగనూరు సోగనూరు రోడ్డులో ఉన్న ఓ వినాయక మండలి సభ్యులు ఐదురోజులకు నిమజ్జనం కార్యక్రమాన్ని 31వ తేదీన నిర్వహించారు. ఇందులో భాగంగా వారు సోగనూరు రోడ్డులో ఏర్పాటు చేసిన వినాయక మండపం నుంచి వినాయక విగ్రహాన్ని ట్రాక్టర్‌లో ఉంచి దాని ముందు ఆటోలో డీజే ఏర్పాటు చేసుకుని ఊరేగింపుగా బయలుదేరారు. ఊరేగింపు ఆకుల కట్టమీదుగా పెద్ద మసీదు వైపు వస్తుండగా సమాచారం అందుకున్న పట్టణ సీఐ శ్రీనివాసులు తన సిబ్బందితో రామస్వామి గుడి దగ్గరకు చేరుకున్నారు. ఒక్కసారిగా ఆయన ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఈ రూట్‌లో ఎలా వస్తారని, ఎవరు పర్మిషన్ ఇచ్చారంటూ రెచ్చిపోయారు. సహనం కోల్పోయిన సీఐ శ్రీనివాసులు ఊరేగింపులో ఉన్న ఓ యువకుడిని కొట్టాడు. అంతటితో ఆగకుండా ఆటోలో కూర్చున్న డ్రైవర్‌పై బూటు కాలుతో పదే పదే తంతూ దాడి చేశాడు. ఈ సంఘటనలను గుర్తుతెలియని వ్యక్తులు వీడియో తీసి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. అనంతరం వినాయక మండలి సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేస్తు ఊరేగింపును పెద్ద మసీదు ముందు నుంచి కాకుండా షరాఫ్ బజార్ మీదుగా మళ్లించారు. ఇదిలా ఉండగా సీఐ శ్రీనివాసులు వ్యవహరించిన తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏదైనా ఉంటే అరెస్టు చేయడమో, వాహనాలను సీజ్ చేయడమో చేయాలి కానీ.. ఇలా పేద యువకులపై బూటు కాళ్లతో దాడులు చేయడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇక ఈ ఘటనపై ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

మొండికేశారు..!

- **వేరుశనగను కొనుగోలు చేయని వ్యాపారులు**
- **గ్రేడింగ్‌పై అధికారుల ఆదేశాలు బేఖాతరు**
- **ఎట్టకేలకు సబ్ కలెక్టర్‌తో చర్చలు**
- **అయినా కొలిక్కిరాని సమస్య**



టెండర్లకు ఉంచిన వేరుశనగ దిగుబడులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వేరుశనగ దిగుబడులు గ్రేడింగ్ లేకుండా కొనుగోలు చేస్తామని వ్యాపారులు ఇచ్చిన మాటను 24 గంటల లోపే మాట మార్చారు. టెండర్ వేసి కొనుగోలు చేయకుండా మొండికేశారు. యథావిధిగా రాశులుగా పోసిన వేరుశనగ దిగుబడులకు గ్రేడింగ్ లేకుండా వ్యాపారులు కొనుగోలు చేస్తారని మార్కెట్ యార్డ్ కార్యదర్శి కల్పన ప్రకటించారు. దీంతో రైతులు వ్యయప్రయాసలతో వచ్చి 11 రోజులుగా యార్డులో పడిగాపులు కాసి ఉన్న రైతులతో పాటు మరో ఐదు వేల బస్తాల వేరుశనగ దిగుబడులను మార్కెట్ యార్డుకు విక్రయానికి తీసుకొచ్చారు. రైతులు గ్రేడింగ్ లేకుండా కొనుగోలు చేస్తారని సంతోషపడి రాశులుగా పోసి టెండర్‌కు ఉంచారు.



వాహనాన్ని అడ్డుకుంటున్న రైతులు

వ్యాపారులు రాకపోవడం..

మధ్యాహ్నం రెండు గంటలైనా వేరుశనగ వ్యాపారులు రాకపోవడం, మరోవైపు మే ఘాలు కమ్ముకొని వర్షం వస్తుండడంతో రైతులంతా మార్కెట్ కమిటీ పైకి దూసు కొచ్చారు. సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ దృష్టికి అధికారులు తీసుకెళ్లడంతో వెంటనే ఆయన మార్కెట్ కమిటీకి చేరుకొని వేరుశనగ దిగుబడులను పరిశీలించారు. రెండు ప్లాట్‌ఫాంలపై రైతులు రాశులుగా టెండర్‌కు ఉంచిన వేరుశనగ దిగుబడుల నాణ్యతను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడారు. పొలం నుంచి నేరుగా వేరుశనగను విక్రయానికి తీసుకురావడంతో తేమ తప్ప ఎక్కడా మట్టి, రాళ్లు కనిపించలేదు. దీంతో వ్యాపారుల వ్యవహార తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. వ్యాపారులను పిలిపించాలంటూ కార్యదర్శి కల్పనను ఆదేశించారు. కొనుగోలు చేస్తామని మాట ఇచ్చి రైతులు విక్రయానికి తెచ్చాక కొనుగోలు చేయకపోవడం ఏమిటని, చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యాపారులు వస్తే వారితోపాటు రైతుల దిగుబడులను పరిశీలిస్తానని రోడ్డుపై నిలబడ్డారు. అరగంట పాటు వేరుశనగ వ్యాపారులు రాకుండా కాలయాపన చేశారు. తమ ఆదేశాలను బేఖాతర్ చేస్తే కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించడంతో ఒక్కొక్కరుగా సబ్ కలెక్టర్ వద్దకు వచ్చారు.

మిగతా 6వ పేజీలో

సాంకేతిక రంగంలో విజయాలు గర్వకారణం

● కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్‌రెడ్డి

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): సాంకేతిక రంగాల్లో సాధించిన విజయాలు దేశంలోని ప్రజలందరికీ గర్వకారణమని కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆ కళాశాలలో అంతరిక్ష పరిశోధన కేంద్రం శ్రీహరి కోట వారి ఆధ్వర్యంలో 'స్పేస్ ఆన్ వీల్' ద్వారా విద్యార్థినులకు దేశం సాధించిన విజయ ఘట్టం నమూనాలు ప్రదర్శించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకట్‌రెడ్డి అధ్యక్షతన కళాశాల భౌతిక శాస్త్ర విభాగం అధ్యాపకులు పాల్గొని విద్యార్థులకు వివరించారు. ట్రిపుల్ ఐటీడీఎం ప్రొఫెసర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఇస్రో సీనియర్ సైంటిస్టుగా బాధ్యతలు నిర్వర్తించి. పదవీ విరమణ తర్వాత కూడా దేశం కోసం తన వంతు సహకారం విద్యార్థులకు సాంకేతిక పరంగా సలహాలు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకురాలు వాసవీదేవి, టీ. సునిత, జి. విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



అంతరిక్ష వీక్షణంలో పాల్గొన్న విద్యార్థినులు

6న 'పల్లెకు పోదాం' ప్రారంభం

- **యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే చర్యలు**
- **కలెక్టర్ రంజిత్ బాషా**

కర్నూలు కలెక్టరేట్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పల్లెకు పోదాం కార్యక్రమం ఈ నెల 6వ తేదీన ప్రారంభం కానున్నదని కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి వర్షాకాల పరిశుభ్రత, ఉపాధి హామీ, యూరియా లభ్యత, పీ-4, అన్నదాత సుఖీభవ, ఐవీఆర్ఎస్ తదితర అంశాలపై మండల స్పెషలాఫీసర్లు, డివిజన్, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా 80మంది ప్రత్యేక అధికారులను నియమించినట్లు ఆయన తెలిపారు. యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డెంగీ, మలేరియా, చికున్ గున్యా తదితర సీజనల్ వ్యాధుల నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వీసీలో జాయింట్ కలెక్టర్ బి.నవ్య, డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, సీపీవో భారతి తదితరులు పాల్గొన్నారు.



6న కర్నూలులో '5కే రన్'

● ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎయిడ్స్ నియంత్రణ నివారణ విభాగం, జిల్లా క్రీడా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీ ఉదయం 6 గంటలకు నగరంలో జిల్లా స్థాయి మారథాన్ 5 కిలోమీటర్ల పరుగు పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ ఎల్.భాస్కర్ తెలిపారు. మంగళవారం కర్నూలు నగరంలో స్టేడియంలో పరుగు పందెంకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఈ పోటీల్లో పాల్గొనడానికి జిల్లా నివాసులై ఉండాలని, 17 నుంచి 25 సంవత్సరాల వయస్సు ఉన్న విద్యార్థులు, యువతీ యువకులు, పురుషులు, మహిళలు, ట్రాన్స్‌జెండర్లు పాల్గొనవచ్చన్నారు. 6వ తేదీ ఉదయం కోల్స్ కాలేజీ నుంచి పార్కు రోడ్డు, రాజ్‌విహార్, కర్నూలు మెడికల్ కాలేజీ, కలెక్టరేట్, సి.క్యాంపు మీదుగా నంద్యాల చెక్‌పోస్టు వరకు పరుగు పందెం ఉంటుందన్నారు. యువత, విద్యార్థులలో హెచ్ఐవీ, ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పించేందుకు యూత్ ఫెస్ట్ కార్యక్రమంలో భాగం. 5 కిలోమీటర్ల పరుగు పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడాశాఖ అధికారి భూపతిరావు, క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ అలిహైదర్ తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందిస్తారన్నారు. జిల్లాలోని అన్నిప్రభుత్వ, ప్రైవేటు కాలేజీ నుంచి విద్యార్థులు, యువతీ యువకులు పాల్గొనాలని కోరారు.



మారథాన్ పరుగు పందెం పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

టీకాలు ఆరోగ్యానికి అభయం


చిన్నారికి టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

- వ్యాధి నిరోధక టీకాలతో రోగాలకు కట్టడి
- అందుబాటులోకి వివిధ రకాల టీకాలు
- అవగాహనలేక దూరంగా ఉంటున్న తల్లిదండ్రులు
- బాలల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడే అవకాశం

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాలానుగుణంగా ప్రభుత్వాలు అందుబాటులోకి తెచ్చిన అధునాతన టీకాలు చిన్నారుల ఆరోగ్యానికి అభయంగా నిలుస్తున్నాయి. పుట్టిన బిడ్డ నుంచి 6, 7 సంవత్సరాల వరకూ ప్రభుత్వం అందించే టీకాలు చిన్నారులు ఎలాంటి రోగాల బారిన పడకుండా కట్టడి చేస్తాయి. గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంది తల్లిదండ్రులు నేటికీ టీకాలపై సరైన అవగాహన లేక బాలల భవిష్యత్తును అంధకారంలో పడేస్తున్నారు. పూర్వకాలంలో సరైన టీకాలు అందుబాటులో లేకపోవడంతో, పాటు అవగాహన లేమితో మాతా శిశు మరణాలు అధికంగా జరిగేవి. ప్రస్తుతం ఆపరిస్థితి ఎంతమాత్రం లేదు. గర్భవతుల దగ్గర నుంచి, పుట్టి ఎదుగుతున్న పిల్లల వరకు వివిధ రకాల టీకాలను ప్రభుత్వాలు అందుబాటులోకి తెచ్చాయి. ప్రాణాంతక వ్యాధులు, దీర్ఘకాలిక రోగాల నివారణే లక్ష్యంగా వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకొని, ఎన్నోరకాల రోగ నిరోధక టీకాలను వైద్య శాఖ అందుబాటులోకి తీసుకువచ్చింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాలో ఉన్న టీకాలపై తల్లిదండ్రులు సరైన అవగాహన చేసుకొని, టీకాలు వేయిస్తే బాలల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసిన వారవుతారని వైద్యులు సూచిస్తున్నారు.

టీకాల పంపిణీ ఇలా

- శిశువు పుట్టిన 24గంటల్లో టీబీ, జాండీస్ నుంచి రక్షణ కోసం బీసీసీ, పోలియో, నివారణకు ఓపీవీ 0 డోసు, కామెర్ల వ్యాధి నివారణ కోసం హైపటైటీస్ టీకాలు పంపిణీ చేస్తున్నారు. 45రోజుల తర్వాత పోలియో నివారణకు ఓపీవీ-1, ఓపీవీ-2, ఓపీవీ-3, ఐపీవీ ఇస్తారు. 75 రోజులు అయ్యాక కోరింత దగ్గు, మెదడువాపు, ధనుర్వాతం, కంఠ సర్పి, న్యూమోనియా నివారణ కోసం పెంటా-1, 2, 3 డోసులను చిన్నారులకు వేస్తారు. 105 రోజుల తర్వాత కడుపు నొప్పి, మూత్ర విసర్జన, నీళ్ల విరోచనాలు, వాంతులు, బరువు తగ్గిపోవడం తదితర రోగాల నివారణ కోసం ఆర్‌వీవీ-1, ఆర్‌వీవీ-2, ఆర్‌వీవీ-3 టీకాలు చిన్నారులకు అందజేస్తారు.

ప్రతి బుధ, శని వారాల్లో..

ప్రతి బుధ, శని వారాల్లో వైద్య సిబ్బంది రోగ నిరోధక టీకాలను పంపిణీ చేస్తారు. ఆయా పట్టణాలు, మండలాలు, గ్రామాలపరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు, గ్రామ సచివాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో టీకాల పంపిణీ చేపడుతున్నట్లు వైద్య శాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. గర్భిణీలతో పాటు, చిన్నారులకు వివిధ రకాల టీకాలను వేస్తున్నారు.

అంధత్వ నివారణ కోసం..

9-12 నెలల తర్వాత అంధత్వ నివారణ కోసం విటమిన్-ఏ, మెదడువాపు వ్యాధి నివారణ కోసం జేఈ-1, తట్టు, రుబెల్లా వ్యాధి నివారణ కోసం ఎంఆర్-1, దగ్గు, జ్వరం, శ్వాసలో ఇబ్బందులు నివారణ కోసం ఎఫ్ఐపీవీ-3, అంధత్వ నివారణకు విటమిన్-ఏ2 పంపిణీ చేస్తున్నారు.

ధనుర్వాతం నివారణ కోసం..

5-6 సంవత్సరాల తర్వాత కోరింత దగ్గు, కంఠ సర్పి, ధనుర్వాతం నివారణ కోసం డీపీటీ-2 టీకాలు ప్రభుత్వ వైద్య శాలల్లో పూర్తి ఉచితంగా అందజేస్తున్నారు.



కొలిమిగుండ్ల ప్రభుత్వ వైద్యశాల

టీకాలు ప్రతి ఆస్పత్రిలో అందుబాటులో..



పుట్టిన బిడ్డ దగ్గర నుంచి 16ఏళ్ల బాల, బాలికల వరకు సుమారు 12రకాల టీకాలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో వేస్తాం. చిన్నారులతో పాటు, గర్భిణులు, బాలింతలు ఈ టీకాలను తప్పనిసరిగా ఉపయోగించుకోవాలి. ప్రభుత్వం అందిస్తున్న ఈరోగ నిరోధక టీకా మందులు ప్రతి ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ అందుబాటులో ఉన్నాయి.

-డా.హరిచరణ్‌రెడ్డి, ప్రభుత్వ వైద్యుడు

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మహమ్మద్‌వలి సత్తా


కలెక్టర్‌తో ప్రశంసా పత్రం అందుకుంటున్న మహమ్మద్ వలి

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): జార్ఖండ్ రాష్ట్రంలోని జంషెడ్పూర్‌లో జరిగిన జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఎమ్మిగనూరు విద్యార్థి మహమ్మద్ వలి సత్తాచాటి ద్వితీయ స్థానంలో నిలిచారు. పట్టణంలోని ఎస్ఎన్ఎస్ జడ్పీహెచ్ ఎస్‌లో 10వ తరగతి చదువుతున్న అతడు జిల్లా, రాష్ట్రస్థాయిలో జరిగిన పోటీల్లో పాల్గొని జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల జంషెడ్పూర్‌లో జరిగిన జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ 72కిలోల పోటీలో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడు. కలెక్టర్ రంజిత్‌బాషా విద్యార్థి మహమ్మద్‌వలిని ప్రశంసాపత్రం ఇచ్చి అభినందించారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటుచేసి కార్యక్రమంలో విజయానికి కారుకులైన పీఈటీలు వెంకటేష్, సృజనను, విద్యార్థి మహ మ్మద్‌వలిని టీడీపీ నాయకులు డాక్టర్ మల్లెల ఆల్‌ఫ్రెడ్‌రాజు, హెచ్ఎం శోభారాణి, మహబూబ్ బాషా, ఉపాధ్యాయులు తిమ్మప్ప, కరెకృష్ణ, భీమేష్, లోకేశ్, మాదన్న, సత్యనారాయణ, పాఠశాల సిబ్బంది అభినందించారు.

నృత్య ప్రదర్శనతో పుణ్యక్షేత్రాలకు...

- దిగువ అహోబిలం నుంచి ఎగువ అహోబిలం వరకు నాట్య ప్రదర్శన


నాట్యం చేస్తూ ఎగువ అహోబిలం వద్దకు చేరుకున్న భవ్య హసిని

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలంలో నెల్లురుకు చెందిన భవ్య హసిని అనే భరతనాట్య కళాకారిణి మంగళవారం దిగువ అహోబిలం నుంచి ఎగువ అహోబిలం వరకు నాట్య ప్రదర్శన చేస్తూ వెళ్లింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నెల్లూరులో తాను పదో తరగతి చదువుతున్నానని చెప్పారు. మహా సంకల్పం పేరిట పలు పుణ్యక్షేత్రాలను దర్శించి భరత నాట్య ప్రదర్శనలు చేస్తున్నట్లు చెప్పారు. ఇటీవల అరుణాచలం క్షేత్రంలో 14కిలో మీటర్ల మేర నృత్య ప్రదర్శన చేశారన్నారు. మాలకొండ, విజయవాడ, ఇంద్రకీలాద్రి పైన కూడా భరతనాట్యం చేసి దర్శించుకున్నానని పేర్కొన్నారు. దిగువ అహోబిలం నుంచి ఎగువ అహోబిలం వరకు 8 కిలోమీటర్లు భారత నాట్యం చేస్తూ లక్ష్మీనరసింహ స్వామివారిని దర్శించుకున్నట్లు తెలిపారు.

జీజీహెచ్‌లో ఓపీ కోసం బారులు


ఓపీ కోసం క్యూలో ఉన్న రోగులు

నంద్యాల హస్పిటల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): నంద్యాల సర్వజన ప్రభుత్వ వైద్యశాలలో మంగళవారం రోగులు ఓపీ కోసం బారులు తీరారు. ఓపీడీ విభాగంలో రక్త పరీక్ష కోసం రోగుల మధ్య తోపులాట జరిగింది. సెక్యూరిటీ సిబ్బంది ఎంత నివారించినా ఫలితం లేకపోయింది. వందల సంఖ్యలో రక్తపరీక్ష కోసం రావడంతో గంటల సమయం పట్టింది. 1500 మందికి పైగా ఓపీ కోసం రాగా.. 500 మందికి పైగా రక్త పరీక్షలు చేయించుకున్నట్లు సమాచారం.

మూడు రోజుల్లో 4,817 క్వింటాళ్ల ఉల్లి కొనుగోలు

- మార్కెటింగ్ శాఖ కమిషనర్ విజయసునీత


మాట్లాడుతున్న మార్కెటింగ్ శాఖ కమిషనర్ విజయసునీత

కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డులో మూడు రోజుల్లో 4,817 క్వింటాళ్ల ఉల్లిని కొనుగోలు చేసినట్లు మార్కెటింగ్‌శాఖ కమిషనర్ విజయసునీత తెలిపారు. కర్నూలు మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో చేపడుతున్న ఉల్లి కొనుగోలు ప్రక్రియను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి పెట్టుబడి, పంట దిగుబడి తదితర విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇప్పటిదాకా క్వింటానికి కేవలం రూ.500, రూ.600 మాత్రమే దక్కిందని, అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు తమ నష్టాలను తెలుసుకొని మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటానికి రూ.1,200 మద్దతు ధర ఇస్తుండడంతో సంతోషంగా ఉందని రైతులు అన్నారు. మార్కెటింగ్ కమిషనర్ మాట్లాడుతూ ఆగస్టులో కురిసిన వర్షాల వల్ల నష్టపోతున్న రైతులకు తక్షణ సాయం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారని తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వం క్వింటానికి రూ.1,200 మద్దతు ధర ప్రకటించి ఉల్లి కొనుగోలు చర్యలు చేపట్టిందని తెలిపారు. కర్నూలు మార్కెట్ యార్డులో ఆదివారం 212 క్వింటాళ్లు, సోమవారం 1,525, మంగళవారం 3,080 క్వింటాళ్లు మూడు రోజుల్లో మొత్తం 4,817 క్వింటాళ్ల ఉల్లిని కొనుగోలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు, డీడీ లావణ్య, ఏడీఎం నారాయణమూర్తి, కర్నూలు మార్కెట్ యార్డు సెక్రటరీ జయలక్ష్మి, చైర్మన్ గోల్కొండ అజ్మత్‌బీ, వైస్ చైర్మన్ శేషగిరిశెట్టి, అసిస్టెంట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు కేశవరెడ్డి, నాగేష్, శివన్న తదితరులు పాల్గొన్నారు.

వీడని జడి వాన

- ఆగస్టులో రెట్టింపు వర్షం
- పైర్లన్నీ నీటిలోనే
- పొంచి ఉన్న ముప్పు
- పత్తి, మొక్కజొన్న, మిర్చి పంటకు తెగుళ్లు


కోడుమూరు ప్రాంతంలో వర్షపు నీటిలోనే పత్తి పంట

కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా పది రోజులుగా జడి వాన కురుస్తోంది. ప్రస్తుత ఖరీఫ్‌లో రైతులు సాగుచేసిన పంటలకు కురుస్తున్న వర్షాలు ముప్పుగా మారాయి. వేరుశనగ పంటతో పాటు రాష్ట్రంలోనే సాగులో మొదటి స్థానంలో ఉన్న పత్తి పంట మరో నెల రోజుల్లో రైతుల చేతికందనుంది. ఉల్లి పంటను రైతులు పొలాల్లోనే కోత కోయకుండా వదిలేశారు. ఎప్పుడెప్పుడు వర్షం తెరిపిస్తుందా అని ఎదురు చూస్తున్నారు. కర్నూలు జిల్లాలో ఖరీఫ్‌లో సాధారణ సాగు విస్తీర్ణం 4,22,540 హెక్టార్లు కాగా, ఇప్పటికే రూ.3,45,094 హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. పత్తి అంచనాకు మించి రూ.2,19,286హెక్టార్లలో సాగైంది. వేరుశనగ 28,353 హెక్టార్లలో, ఆముదం 9,185 హెక్టార్లలో, ఉల్లి 10,018 హెక్టార్లు, మిర్చి 14,369 హెక్టార్లు, టమోటా 1,451 హెక్టార్లు, పొగాకు 575 హెక్టార్లు, ఆముదం 8,675 హెక్టార్లు, కంది 34,401 హెక్టార్లు, కొర్ర 4,502 హెక్టార్లు, మొక్కజొన్న 3,607 హెక్టార్లు, సద్ద 4,844 హెక్టార్లు, జొన్న 30 హెక్టార్లు, వరి 1,658 హెక్టార్లలో సాగైంది. వర్షం ఏ మాత్రం తెరపి ఇవ్వకుండా రోజూ కురుస్తుండటంతో రైతులు చేతికొచ్చిన పంట ఎక్కడ నీటి పాలవుతుందోనని ఆందోళన చెందుతున్నారు.

సాధారణం కంటే 205.8 మి.మీ. వర్షపాతం నమోదు

ఖరీఫ్ జూన్‌లోనే మొదలైనా మే నెలలోనే ముందస్తు వర్షాలు కురిశాయి. సాధారణ సాగు విస్తీర్ణం 4లక్షల హెక్టార్లలో 20 శాతం పంటలు రైతులు ఖరీఫ్ ముందే సాగు చేశారు. ఆగస్టులో సాధారణ వర్షపాతం 112.5 మి.మీ కాగా, ఆగస్టు నెలాఖరుకు సాధారణం కంటే 205.8 మి.మీ వర్షపాతం నమోదైంది. జూన్‌లో 77.7 మి.మీ సాధారణ వర్షానికి గానూ 74.3 మి.మీ , జూలై నెలలో 90.7 మి.మీ, కురవాల్సి ఉండగా కేవలం 76.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

పంటలన్నీ దెబ్బతింటున్నాయి

ఆగస్టులో ఒక్కరోజు కూడా తెరిపి ఇవ్వకుండా వర్షాలు పడుతుండటంతో పక్వానికి వచ్చిన పంటలన్నీ తీవ్రంగా దెబ్బతింటున్నాయి. కనీసం పొలాల్లో నిల్వఉన్న నీటిని బయటకు పంపేందుకు రైతులకు అవకాశం లేకుండాపోతోంది. దీంతో పత్తి పైర్లకు పచ్చ పురుగు, గులాబీ పురుగులు వ్యాపించాయి. మొక్కజొన్నకు కత్తెర పురుగు సోకింది. వేరుశనగకు కాండం తొలుచు పురుగు, టమోటా, మిర్చి, ఉల్లి, తదితర పంటలకు భారీగా తెగుళ్లు సోకాయి. ఈ తెగుళ్లు, పురుగులను నిరోధించేందుకు రైతులు ఎకరాకు ఇప్పటికే రూ.5వేల వరకు ఖర్చుచేశారు. వానదేవుడు కరుణించి కొంత తెరిపిస్తే గట్టెకుతామని, లేకపోతే నిండా మునిగిపోతామని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

మొండికేశారు..!

5వ పేజీ తరువాయి

ప్లాట్‌ఫాంపై ఉన్న వేరుశనగ దిగుబడులను వారితో పాటు పరిశీలించారు. కొనుగోలు చేస్తామని ఒప్పుకొని రైతులని ఇబ్బంది పెట్టడం మంచిది కాదన్నారు. మార్కెట్‌యార్డ్ కార్యాలయంలో వ్యాపారులు కమీషన్ ఏజెంట్లతో వేర్వేరుగా సమావేశమయ్యారు. ప్రస్తుతం వచ్చిన దిగుబడులను కొనుగోలు చేయాలని వ్యాపారులపై ఒత్తిడి తెచ్చారు. గ్రేడింగ్ ఉంటేనే తాము వేరుశనగ కొనుగోలు చేస్తామని, లేకపోతే కొనుగోలు చేయలేమంటూ బయటికి వచ్చేశారు. దీంతో సమస్య కొలిక్కి రాలేదు. సబ్‌కలెక్టర్ బయటికి రావడంతో రైతులంతా చుట్టుముట్టి వేరుశనగ కొనుగోలుచేసి గ్రామాలకు పంపా లంటూ వేడుకున్నారు. రైతులకు న్యాయం చేస్తామని వ్యాపారులతో చర్చలు జరుపుతున్నామంటూ అక్కడి నుంచి వెళ్లిపోయారు.


వ్యాపారుల కోసం రోడ్డుపైనే నిలబడి వేచి చూస్తున్న సబ్ కలెక్టర్

మార్కెటింగ్ చట్టాన్ని ఉల్లంఘించి..

వ్యాపారులు మార్కెటింగ్ శాఖ చట్టాన్ని ఉల్లంఘించి రైతులకు నష్టం చేకూర్చే గ్రేడింగ్ విధానం కొనసాగిస్తున్నా అధికారులు చర్యలు తీసుకోకపోవడమే ప్రధాన కారణమైంది. సీజన్ ఆరంభం కావడం మరోవైపు వర్షాలు పడుతుండడంతో రైతులు అమ్ముకోవడానికి అవస్థలు పడుతున్నారు. 11 రోజులుగా మార్కెట్ కమిటీలో వేరు శనగ దిగుబడులను కొనుగోలు చేయకపోవడం పట్ల రైతులు ఆవేదన చెందుతున్నారు. కర్నూలు, ఎమ్మిగనూరు, మార్కెట్‌కు రైతులు విక్రయానికి తరలించకపోతున్నారు. మరోవైపు కొందరు మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు దృష్టికి తీసుకెళ్తే వ్యాపారులతో, హమాలీలతో మాట్లాడి సమస్య సత్వరమే పరిష్కారం అవుతుందంటూ కొందరు బాహాటంగా చర్చించుకుంటున్నారు. లైసెన్సు రద్దుకు నోటీసులు ఇస్తున్నామని మార్కెట్ యార్డ్ కార్యదర్శి కల్పన తెలిపారు. ప్రస్తుతం మార్కెట్ లో ఉన్న వేరుశనగ ఎమ్మిగనూరు, కర్నూలు వ్యాపారులతో కొనుగోలు చేసేందుకు వారితో మాట్లాడుతున్నట్లు తెలిపారు.

నష్టానికి కొనుగోలు చేయలేం

వేరుశనగ పాసింగ్ చేయకుండా తమకు నష్టం చేకూర్చేలా కొనుగోలు చేయలేమని వేరుశనగ వ్యాపారులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. మంగళవారం వేరుశనగ వ్యాపారులు సమావేశం నిర్వహించారు. రైతులు మార్కెట్ కమిటీకి మట్టి, రాళ్లతోపాటు చెత్తాచెదారంతో తీసుకొస్తున్నారని, దీనివల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. ఈ సమావేశంలో అధ్యక్షుడు శరణప్ప, నిజాముద్దీన్ నాగరాజు, మల్లికార్జున, అస్లాం నర్సిరెడ్డి, సురేంద్రబాబు పాల్గొన్నారు.

వ్యాపారులకు షోకాజ్ నోటీసులు

మార్కెట్ కమిటీ చట్టాన్ని ఉల్లంఘించి రైతులకు నష్టం చేకూర్చే విధంగా వ్యవహరిస్తున్న వేరుశనగ వ్యాపారులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు మార్కెట్ యార్డ్ కార్యదర్శి కల్పన తెలిపారు. సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ వ్యాపారులతో చర్చలు జరిపిన వారు పాసింగ్ కొనసాగిస్తేనే వేరుశనగ కొనుగోలు చేస్తామని చెప్పారన్నారు. నిబంధనల మేరకు వేరుశనగ వ్యాపారులు తమతో లైసెన్స్ పొంది నిబంధనలు ఉల్లంఘించి వ్యవహరిస్తున్నారన్నారు.

రేపు గణేశ్ విగ్రహాల సామూహిక నిమజ్జనం

- నిమజ్జనోత్సవం శాంతియుత వాతావరణంలో నిర్వహించాలి
- గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి ప్రతినిధులు


మాట్లాడుతున్న గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి జిల్లా కార్యదర్శి రంగస్వామి

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని గణేశ్ నవరాత్రి ఉత్సవ మంటపాల్లో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలకు గురువారం సామూహికంగా నిమజ్జనం చేస్తారని, ఉత్సవాన్ని శాంతియుత వాతావరణంలో జరిగేలా మంటపాల ప్రతినిధులు అధికారులకు, ఉత్సవ కమిటీల నిర్వాహకులకు సహకరించాలని గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి ప్రతినిధులు సూచించారు. మంగళవారం నగరంలోని కేసీ కెనాల్ వినాయక ఘాట్‌లోగల గణేశ్ మందిరం సమావేశహాలులో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సమితి జిల్లా సంఘటన కార్యదర్శి డాక్టర్ ఎం.నాగఫణిశాస్త్రి, జిల్లా, నగర అధ్యక్షుడు వేణుగోపాల్, ఎస్.రంగ స్వామి, జిల్లా, నగర ప్రధాన కార్యదర్శులు గోరంట్ల రమణ, సీవీ గిరిరాజ వర్మ, ఇతర ప్రతినిధులు మాళిగి భానుప్రకాశ్, అక్కెం విశ్వనాథ్, బీజేవైఎం రాష్ట్ర నాయకుడు కాశీ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణేశ్ నవరాత్రి ఉత్స వాలు ఉమ్మడి జిల్లాలో ఘనంగా ప్రారంభమయ్యాయని, జిల్లాలో ప్రభుత్వ అధికారులు, కమిటీ నిర్వాహకుల సహకారంతో గణేశ్ నిమజ్జనోత్స వాలు మూడు, ఐదు రోజుల్లో నంద్యాల, ఆదోని పట్టణంతోపాటు వివిధ ప్రాంతాల్లో జరిగాయన్నారు. కర్నూలు నగరంలో ఈనెల 4న ఉదయం 9 గంటలకు పాతనగరంలోని శ్రీరాంబొట్ల దేవాలయం వద్ద 9 గంటలకు మొదటి ఊరేగింపు ప్రారంభమవుతుందన్నారు. ఈ ఊరేగింపునకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్, భాగ్యనగర్ గణేశ్ మహోత్సవ సమితి అధ్యక్షుడు జి. రాఘవరెడ్డి, నగర మేయర్ బీవై రామయ్య, కలెక్టర్ పి. రంజిత్ బాషా, ఎస్పీ విక్రాంత్ పాటిల్, జేసీ డాక్టర్ బి.నవ్య హాజరవుతారని ఆయన వివరించారు. మధ్యాహ్నం 2 గంటలకు వినాయ ఘాట్ వద్ద మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ జ్యోతి ప్రజ్వలన, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు ధ్వజారోహణం, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి భరతమాత చిత్రపటానికి పూజ చేసి నిమజ్జనోత్సవాన్ని ప్రారం భిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, బొగ్గుల దస్తగిరి, నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ, వీహెచ్‌పీ నాయకులు నందిరెడ్డి సాయిరెడ్డి, టీసీ మద్దిలేటి పాల్గొంటారని తెలిపారు. సంప్రదాయ పద్ధతిలో మేళతాళాలు, భజనలు చేస్తూ ఊరేగింపులో పాల్గొనాలని, మత్తుపా నీయాలు సేవించరాదని సూచించారు. నిమజ్జనోత్సవ వేడుకల్లో భాగంగా కేసీ కెనాల్ వినాయక ఘాట్‌పై రాత్రి 7 గంటలకు డాక్టర్ ఎం. నాగఫణి శాస్త్రి బృందం ఆధ్వర్యంలో 'గంగాహారతి' కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో గణేశ్ ఉత్సవాలు


లక్ష్మీనగర్‌లో కొలువైన వినాయకుడు


డాక్టర్స్ కాలనీలో..

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగరంలో గణేశ్ ఉత్సవాలు మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో నెలకొల్పిన గణేశ్ మంటపాల వద్ద ఉదయం, సాయంత్రం వేళల్లో భక్తులు విచ్చేసి తొలి పూజల ఇలవేల్పునకు ప్రత్యేక పూజలు, అర్చనలు, విశేష హారతులు, గణేశ పంచాక్షరీ స్తోత్రాలు, అష్టోత్తర నామ పారాయణలు చేస్తున్నారు. గణేశ్ మంటపాల వద్ద సాయంత్రం వేళల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, సంగీత కచేరీలు, చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించారు. లక్ష్మీనగర్, అరోరానగర్, అశోక్‌నగర్, కొత్తపేట, ఎన్ఆర్‌పేట, ఓల్డ్ బస్టాండ్ తదితర ప్రాంతాల్లో వివిధ రూపాల్లో ఆసీనులైన విఘ్నేశ్వరులు విశేషంగా ఆకట్టుకున్నాయి. నవరాత్రి ఉత్సవాల్లో ఏడో రోజున మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు, సాయంత్రం అల్పాహారం పంపిణీ చేశారు.


మహాలక్ష్మీ నగర్‌లో..


అరోరానగర్ వీక్షాంపులో..

రేపు వినాయక విగ్రహాల నిమజ్జనం

- కర్నూలు కేసీ కెనాల్‌లో గంగమ్మ ఒడిలో కలవనున్న 730 విగ్రహాలు
- నిమజ్జనం రోజు ట్రాఫిక్ మళ్లింపు
- 1,858 మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు
- డ్రోన్, సీసీ కెమెరాలతో గట్టి నిఘా
- ప్రజలు పోలీసులకు సహకరించాలి : ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు క్రైం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వినాయక పర్వదినం రోజు నుంచి మండపాల్లో ప్రతిష్ఠించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించిన గణనాయని విగ్రహాలను గురువారం నిమజ్జనానికి తరలించనున్నారు. ఇందుకోసం భారీ పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. మంగళవారం ఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 4వ తేదీన నగరంలో 730 గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేయనున్నట్లు తెలిపారు. ఇందుకు పోలీసు శాఖ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రశాంత వాతావరణంలో వేడుకలు జరుపుకోవాలని సూచించారు.



ట్రాఫిక్ మళ్లింపు

నిమజ్జనం సందర్భంగా గురువారం నగరంలో ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందని ఎస్పీ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి వినాయక నిమజ్జనం పూర్తయ్యే వరకు ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందని తెలిపారు.

- ఆర్టీసీ బస్టాండు నుంచి రాజ్‌విహార్ సెంటర్, ప్రభుత్వ ఆసుపత్రి, వినాయక ఘాట్, గాయత్రి ఎస్టేట్ వరకు ఎటువంటి వాహనాలకు అనుమతులు ఉండవు. వాహనాల రాకపోకలు నిషేధం.
- బస్టాండు నుంచి ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలను బళ్లారి చౌరస్తా మీదుగా కల్లూరు చెన్నమ్మ సర్కిల్, గుత్తి పెట్రోల్ బంక్, బిర్లా జంక్షన్, మద్దూర్ నగర్ సర్కిల్, సీక్యాంపు మీదుగా నంద్యాల చెక్‌పోస్టు వైపు వాహనాల రాకపోకలు సాగించాలి.
- ఆత్మకూరు, నంద్యాల, నందికొట్కూరు, నంద్యాల చెక్‌పోస్టు వైపు నుంచి నగరంలోనికి వచ్చే వాహనాలు సీక్యాంపు, బిర్లాగేట్, గుత్తి పెట్రోల్ బంకు నుంచి కల్లూరు చెన్నమ్మ సర్కిల్, బళ్లారి చౌరస్తా మీదుగా ఆర్టీసీ బస్టాండుకు చేరుకుంటాయి.
- హైదరాబాదు, గద్వాల, అలంపూరు నుంచి వచ్చే వాహనాలు తుంగభద్ర బ్రిడ్జి, సంతోష్‌నగర్, బళ్లారి చౌరస్తా మీదుగా కర్నూలు ఆర్టీసీ బస్టాండుకు చేరుకుంటాయి.
- అనంతపురం, డోన్ నుంచి వచ్చే వాహనాలు గుత్తి పెట్రోల్ బంకు, బళ్లారి చౌరస్తా మీదుగా ఆర్టీసీ బస్టాండుకు చేరుకుంటాయి.
- నిమజ్జనం పూర్తయిన తర్వాత నిమజ్జన వాహనాలు దేవనగర్ మీదుగా కృష్ణానగర్, కల్లూరు బ్రిడ్జి మీదుగా బయటకు వెళ్తాయి.

భారీ బందోబస్తు

వినాయక నిమజ్జనం సందర్భంగా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. బందోబస్తు విధుల్లో అడిషనల్ ఎస్పీలు, 12 మంది డీఎస్పీలు, 72 మంది సీఐలు, ఆర్ఐలు, 146 మంది ఎస్ఐలు, 412 మంది ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, 718 మంది పోలీసు కానిస్టేబుళ్లు, 14 మంది ఏఆర్, 34 మంది మహిళా పోలీసులు, 17 మంది స్పెషల్ పార్టీ పోలీసులు, 459 మంది హోంగార్డులను బందోబస్తు విధులకు ఏర్పాటు చేశామని ఎస్పీ వివరించారు. అలాగే డ్రోన్లు, సీసీ కెమెరాలతో గట్టి నిఘా ఏర్పాటు చేశామన్నారు. అలాగే వినాయక మాట్ల వద్ద బాంబు డిస్పోజబుల్, డాగ్ స్క్వాడ్ బృందాలతో తనిఖీలు చేస్తున్నామన్నారు. అనుమానిత వస్తువులు గానీ, వ్యక్తులు గానీ ఉంటే 100 లేదా 112కు ఫోన్ చేయాలని, లేకపోతే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అత్యవసర 108, ఫైర్, అంబులెన్సులు, పోలీసువాహనాలు సేవల కోసం పోలీసుల అనుమతి పొందిన వాహనాలు మాత్రమే నిమజ్జన మార్గంలో అనుమతిస్తామన్నారు.

జాగ్రత్తలు పాటించాలి

విగ్రహాలను క్రేన్లు, ట్రాక్టర్ల ద్వారా నిమజ్జనానికి తీసుకెళ్లే సమయంలో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. అలాగే నిమజ్జనంలో కేసీ కెనాల్ ఘాట్లు, కాలువలకు చిన్నారులు, మహిళలు దూరంగా ఉండాలన్నారు. ఇతరులకు ఇబ్బంది కలుగకుండా అల్లరి మూకలపై గట్టి నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఎవరైనా ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

దైవ దర్శనానికి వెళ్తూ..

- అదుపుతప్పి ఆటో బోల్తా
- ఒకరి మృతి • మరో ఇద్దరికి గాయాలు

మద్దికెర, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దైవ దర్శనానికి వెళుతూ ప్రమాదవశాత్తూ మంగళవారం ఆటో బోల్తా పడిన సంఘటనలో అంకిలంటి లలితమ్మ (55) మృతి చెందారు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి.



డివైడర్ ఢీకొని బోల్తాపడ్డ ఆటో



లలితమ్మ (ఫైల్)

ఎస్ఐ విజయకుమార్ నాయక్ వివరాల మేరకు.. మద్దికెర గ్రామానికి చెందిన 16 మంది వ్యవసాయ కూలీలు అరుణాచలం దైవదర్శనానికి వెళ్లేందుకు మంగళవారం ఉదయం బయలుదేరారు. మద్దికెర నుంచి గుంతకల్లు రైల్వేస్టేషన్‌కు రెండు ఆటోల్లో బయలుదేరారు. మార్గమ ధ్యలో ఆటో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న అంకిలంటి లలితమ్మకు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే కర్నూలు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆమె మృతి చెందింది. అలాగే ఈశ్వరమ్మ అనే మహిళతో పాటు మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని ప్రభుత్వ ప్రైవేటు వైద్యశాలలకు తరలించారు. కాగా మృతి చెందిన లలితమ్మకు భర్త శ్రీనివాసులుతో పాటు ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. ఈ మేరకు ఎస్ఐ విజయకుమార్ నాయక్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

గడివేముల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిందుకూరు గ్రామానికి చెందిన కమాల్‌సా (67) అనే వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కమాల్‌సా గత కొన్ని సంవత్సరాల నుంచి అనారోగ్యంతో బాధపడుతుండేవాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం పురుగు మందు తాగాడు. గమనించిన చుట్టుపక్కల వారు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడి అదృశ్యం

గడివేముల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గడివేములకు చెందిన వినోద్‌కుమార్ అనే యువకుడు అదృశ్యమయాడని ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలిపారు. గత నెల 31న పండ్లన్ ఉందని ఇంటిలో నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో తండ్రి రాజు పోలీసులను ఆశ్రయించాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఫర్టిలైజర్ యజమానిపై కేసు నమోదు

కోడుమూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తున్న శ్రీలక్ష్మీ ఫర్టిలైజర్ షాపు యజమానిపై కేసు నమోదు చేసినట్లు మంగళవారం ఎస్ఐ డీఫ్ సామి తెలిపారు. రసాయనిక ఎరువులను ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే అధికంగా విక్రయించడని మండలంలోని వైన్‌దొడ్డి గ్రామానికి చెందిన రైతు చిన్న వీరన్న ఫిర్యాదు చేశారన్నారు. అధిక ధరలకు విక్రయం చేసిన ఫర్టిలైజర్ యజమాని పట్నం కృష్ణమూర్తి పై బీఎన్ఎస్, ఎసెన్షియల్ కమ్యూనిటీ యాక్ట్ కింద కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు.

పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం



చెక్కు పంపిణీ చేస్తున్న ఏఎస్పీ హుస్సేన్ పీరా

కర్నూలు క్రైం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పోలీసు కుటుంబాలకు అండగా ఉంటామని అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా భరోసా ఇచ్చారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో పదవీ విరమణ, సాధారణ, అనారోగ్య, ప్రమాదంలో మృతి చెందిన పోలీసు కుటుంబాలతో పోలీసు వెల్ఫేర్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఏ.ఎం.హీరా, ఏ.ఎస్ఐ, డి.మునిస్వామి, ఎస్.మాలిక్ అహ్మద్, ఎస్.బాజాషేర్, రేణుకమ్మ కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల కంట్రిబ్యూషన్ ఫండ్ చెక్కులను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, డీఎస్పీలు బాబ్జిరావు, ప్రసాద్, ఏవో విజయలక్ష్మి, ఆఫీసు జావేద్, నారాయణ, డీపీవో సిబ్బంది, పోలీసు సంఘం అధ్యక్షుడు నాగరాజు, ఏపీ హోంగార్డు వెల్ఫేర్ అసోసియేషన్ కర్నూలు జిల్లా ప్రెసిడెంట్ సాయికృష్ణ, వైస్ ప్రెసిడెంట్ ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న సన్నిధిలో యూపీ మంత్రి



మంత్రిని సన్మానిస్తున్న అర్చకులు, వేదపండితులు

నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రాన్ని మంగళవారం ఉత్తరప్రదేశ్(యూపీ) రాష్ట్రానికి చెందిన వొకేషనల్ విద్యాశాఖ మంత్రి కపిలదేవ్ అగర్వాల్ దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ వేదాశీర్వచన మండపంలో మంత్రి కపిలదేవ్ అగర్వాల్‌ను ఆలయ అర్చకులు ఘనంగా సన్మానించారు.

ఉల్లి పంటను వదిలేసిన రైతు

నందికొట్కూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్యాల గ్రామం వద్ద రామకృష్ణ అనే రైతు తనకు ఉన్న రెండు ఎకరాల్లో పొలంలో ఉల్లి సాగు చేశారు. కోత దశకు రావడంతో ఉల్లిని కోసేందుకు సిద్ధం కాగా ప్రస్తుతం ఉన్న ధరను గమనించి పొలంలో నుంచి బయటకు తీసేందుకు కూడా ఖర్చులు భరించలేక వదిలేశాడు. దీంతో గొర్రెల కాపరులు గొర్రెలను మేపుకున్నారు. ఎకరాకు రూ.60 వేల నుంచి 80 వేల వరకు ఖర్చుఅయిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. వర్షాలు అధికంగా ఉండడంతో దిగుబడి చాలా తగ్గింది. కేవలం ఎకరాకు 40 క్వింటాళ్ల దిగుబడి రావడం గగనమైపోయింది. రైతుకు రూ.40 వేల నుంచి 50 వేల వరకు నష్టం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఉల్లిపంటను మేస్తున్న గొర్రెలు

రేషన్ మాఫియా దందా

- పత్తికొండలో 133 క్వింటాళ్ల బియ్యం పట్టివేత
- లారీ సీజ్.. బియ్యం గోడౌన్‌కు తరలింపు
- అక్రమార్కులపై చర్యలు
- ఆర్డీవో భరత్‌నాయక్



రేషన్ బియ్యాన్ని తూకం వేస్తున్న రెవెన్యూ అధికారులు

పత్తికొండ టౌన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): 'అక్రమార్కు కాదేదీ అనర్హం' అన్నట్లు కొందరు రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించి జేబులు నింపుకుంటున్నారు. అక్రమార్కులు రేషన్ బియ్యాన్ని లారీల్లో తరలిస్తూ పట్టుబడ్డారు. సంఘటన స్థలానికి చేరుకున్న పత్తికొండ ఆర్డీవో భరత్‌నాయక్ రేషన్ బియ్యంగా నిర్ధారించి లారీని సీజ్ చేసి పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన మంగళవారం పత్తికొండ పట్టణంలో చోటు చేసుకుంది. పత్తికొండ పట్టణంలో రేషన్ బియ్యాన్ని అక్రమార్కులు లారీలో లోడు చేసుకుని ఆదోనికి తరలిస్తుండగా హీరో షోరూం వద్ద గుంతలో లారీ ఇరుక్కుపోయింది. ఆ లారీని ఎక్స్‌వేటర్ సాయంతో ఈ బయటకు తీసే క్రమంలో లారీలో ఉన్న రేషన్ బియ్యం కిందపడ్డాయి. దీంతో స్థానికులు రేషన్ బియ్యంగా గుర్తించారు. వారు వెంటనే ఆర్డీవో భరత్‌నాయక్, రెవెన్యూ అధికారులకు సమాచారమిచ్చారు. ఆర్డీవో భరత్‌నాయక్ హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని ఆరా తీశారు. లారీ డ్రైవర్ ను విచారించగా పొంతనలేని సమాధానం చెప్పడంతో లారీని సీజ్ చేసి పోలీసులకు అప్పగించారు. లారీని గోడౌన్‌కు తరలించి తూకం వేశారు. 236 బ్యాగుల్లో 133.3 క్వింటాళ్ల బియ్యాన్ని రెవెన్యూ అధికారులు గోడౌన్‌లో భద్రపరిచారు.



లారీ డ్రైవర్‌ను విచారిస్తున్న ఆర్డీవో

బియ్యం సేకరించేది ఇలా..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా పేదలకు నెలనెలా ఉచితంగా బియ్యం సరఫరా అవుతాయి. రేషన్ మాఫియా కొందరు పేదల నుంచి, రేషన్ డీలర్ల నుంచి బియ్యాన్ని ఏజెంట్ల ద్వారా సేకరిస్తున్నారు. ఆ బియ్యాన్ని కర్నూలు రోడ్డులోని ఓ గోడౌన్‌లో భద్రపరిచి అక్కడి నుంచి లారీల్లో ఆదోని ప్రాంతానికి, అక్కడి నుంచి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

పట్టుబడింది ఇలా..

పత్తికొండ పట్టణంలోని కర్నూలు రోడ్డులో అక్రమ వ్యాపారులు దుకాణాలను అద్దెకు తీసుకుని బియ్యాన్ని అద్దె గదుల్లో నిల్వ చేసుకుంటున్నారు. వందలాది క్వింటాళ్లను సేకరించిన తర్వాత లారీల్లో ఆదోనికి తరలించి పెద్దఎత్తున సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం.

అక్రమ బియ్యం గోడౌన్‌కు తరలింపు

లారీలో పట్టుబడిన బియ్యాన్ని ఆర్డీవో భరత్‌నాయక్ సీజ్ చేసి పోలీసులకు అప్పగించారు. లారీని సివిల్ సప్లై గోడౌనుకు తరలించారు. అక్కడ సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ జహనాజ్, ఆర్ఐ శ్రీనివాసరావు పట్టుబడిన బియ్యాన్ని తూకం వేసి గోడౌన్‌లో భద్రపరిచారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశారు.

అక్రమార్కులపై చర్యలు తప్పవు

పేదలకు దక్కాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తప్పవు. అక్రమంగా తరలిస్తున్న బియ్యం వ్యవహారంలో సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపైన చర్యలు తీసుకుంటాం. - భరత్‌నాయక్, ఆర్డీవో

వెదుర్ల అక్రమ రవాణా

- నల్లమలలో అటవీ శాఖాధికారుల దాడులు
- పట్టుబడిన వాహనం • రెండు వాహనాలకు ఒకే నెంబర్

రుద్రవరం,సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నల్లమల అడవిలో వెదురు అక్రమ రవాణాపై అటవీ శాఖ అధికారులు దాడి చేపట్టారు. ఈ దాడుల విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టుబడిన రెండు వాహనాలకు ఒకే నెంబర్ ఉండటం గమనార్హం. రుద్రవరం పొరెస్టు సెక్షన్ పరిధిలో ఉన్న రేంజ్ పచ్చర్ల బోగాద మధ్య నాలుగు రోజు ల కిందట మొబైల్ పార్టీ అధికారులు దాడులు చేశారు. ఈ దాడిలో వెదురుతో పాటు వాహనం కూడా పట్టుబడ్డాయి. సుమారు 45 రోజుల క్రితం రుద్రవరం మండలం ఎల్లావత్తుల గ్రామ సమీపంలో మొబైల్ పార్టీ అధికారుల దాడిలో మరో వాహనం వెదురుతో పట్టుబడింది. ఎల్లా వత్తుల గ్రామ సమీపంలో పట్టుబడిన వాహనాన్ని గాజులపల్లె కలప డిపోకు తరలించారు. అటవీ ప్రాంతంలో పచ్చర్ల, బోగాద మధ్య పట్టుబడిన వాహనం ఏకో టూరిజం వద్ద ఉంచారు. ఈ రెండు వాహనాలకు ఏపీ 37టీఏ6567 నెంబర్లు కలిగి ఉన్నాయి.



గాజులపల్లె డిపోలో సీజ్‌చేసిన వాహనం



అదే నంబర్‌తో పచ్చర్లలో మరో వాహనం

జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు పదోన్నతి

- అదనపు డీఎంఈగా నియామకం
- ఉత్తర్వులు జారీ చేసిన స్పెషల్ చీఫ్ సెక్రటరీ



డాక్టర్ వెంకటేశ్వర్లు

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డా.కె.వెంకటేశ్వర్లుకు అడిషనల్ డీఎంఈ (డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్)గా పదోన్నతి లభించింది. ఈమేరకు రాష్ట్రంలోని ఐదుగురు ప్రొఫెసర్లకు అడిషనల్ డీఎంఈగా పదోన్నతులు ఇస్తూ వైద్యఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కె.వెంకటేశ్వర్లు కూడా ఉన్నారు. 2024 అక్టోబరు 29న జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయన 10 నెలల తర్వాత అడిషనల్ డీఎంఈగా పదోన్నతి లభించి రెగ్యులర్ సూపరింటెండెంట్‌గా కొనసాగనున్నారు. కర్నూలు జిల్లా గూడూరుకు చెందిన డాక్టర్ వెంకటేశ్వర్లు 1 నుంచి 12వ తరగతి వరకు కోరుకొండ సైనిక్ స్కూల్‌లో చదివారు. గుంటూరు మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్, ఎంఎస్ ఆర్థో పూర్తి చేసి 1998 నుంచి కర్నూలు మెడికల్ కాలేజీలో ఆర్థోపెడిక్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా వైద్యవృత్తిలో చేరారు. రెండేళ్లు అసోసియేట్ ప్రొఫెసర్‌గా వరంగల్‌లో పని చేసి తిరిగి కర్నూలుకు వచ్చారు. 2015లో ప్రొఫెసర్‌గా 2024 అక్టోబరు 28న కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా నియమితులయ్యారు. ప్రస్తుతం అడిషనల్ డీఎంఈగా పదోన్నతి పొందారు.

కొత్త ప్రిన్సిపాళ్ల నియామకం

- పలువురు సూపరింటెండెంట్ల బదిలీ

అమరావతి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మూడు ప్రభుత్వ వైద్య కళాశాలలకు కొత్త ప్రిన్సిపాళ్లను, నాలుగు బోధనాసుపత్రులకు ప్రభుత్వం సూపరింటెండెంట్లను నియమించింది. ఈ మేరకు ఆరోగ్యశాఖ స్పెషల్ సీఎస్ ఎం.టి.కృష్ణబాబు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. విజయనగరం ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ దేవీ మాధవిని, అనంతపురం వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ విజయశ్రీని నియమించింది. విజయనగరం బోధనాసుపత్రి సూపరింటెండెంట్ అప్పలనాయుడును బదిలీ చేసి శ్రీకాకుళం ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమించింది. మచిలీపట్నం జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ సౌమినిని నియమించింది. ఆంధ్ర మెడికల్ కాలేజీ సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ కిశోర్‌కు అడిషనల్ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పించి పలాసలోని కిడ్నీ రిసెర్చ్ సెంటర్ సూపరింటెండెంట్‌గా నియమించింది. పలాస కిడ్నీ సెంటర్ సూపరింటెండెంట్‌గా ఉన్న డాక్టర్ అల్లు పద్మను విజయనగరం బోధనాసుపత్రి సూపరింటెండెంట్‌గా బదిలీ చేసింది. నంద్యాల ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మల్లీశ్వరిని అనంతపురం ప్రభుత్వాసుపత్రికి బదిలీ చేశారు. ఆరోగ్యశాఖలో రెండు రోజుల క్రితం ఏడుగురు సీనియర్ ప్రొఫెసర్లకు అడిషనల్ డైరెక్టర్లుగా పదోన్నతులు కల్పించిన ఈ బదిలీలు చేపట్టింది.

జాతీయ పారా త్రోబాల్ చాంపియన్‌గా ఏపీ జట్టు

- సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు
- కెప్టెన్ రోశిరెడ్డి



కప్‌తో ఆంధ్రప్రదేశ్ పారా త్రోబాల్ జట్టు

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): 4వ జాతీయ స్థాయి పారా త్రోబాల్ చాంపియన్‌షిప్‌ను ఆంధ్రప్రదేశ్ పారా త్రోబాల్ పురుషుల జట్టు కైవసం చేసుకున్నట్లు పారా త్రోబాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎల్లవల్లి సూర్యనారాయణ, గంగాళ్లైవారెడ్డి మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 29నుంచి 31వరకు కోయంబత్తూరులో నిర్వహించిన పోటీల్లో 12రాష్ట్రాల జట్లు పాల్గొన్నాయన్నారు. ఆంధ్ర జట్టు వెన్నపూస రోశిరెడ్డి నాయకత్వంలో బరిలో దిగి కర్ణాటక, రాజస్థాన్, పాండిచ్చేరి రాష్ట్రాల జట్లతో గెలుపొంది తుదిపోరుకు చేరుకున్నారు. ఫైనల్ పోటీలో జార్ఖండ్ జట్టుపై గెలుపొంది చాంపియన్‌గా నిలిచిందన్నారు. ఈ సందర్భంగా కెప్టెన్ రోశిరెడ్డి మాట్లాడుతూ ప్రథమంగా జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ జట్టు చాంపియన్‌గా నిలవడం గర్వకారణమన్నారు. సహకరించిన టోటీ క్రీడాకారులకు ఏపీ త్రోబాల్ సంఘానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్‌యూలో పరిశుభ్రతకు పెద్దపీట: వీసీ

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూని వర్సిటీలో పరిశుభ్రతకు పెద్దపీట వేస్తున్నట్లు ఉపకులపతి వి.వెంకట బసవరావు తెలిపారు. మంగళవారం వర్సిటీ క్యాంపస్‌లో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో పచ్చదనానికి ఉపకరించే వివిధ యంత్ర సాధనాలు, పనిముట్లను కొనుగోలు చేసిన వర్సిటీ విభాగాన్ని ఆయన అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ బోయ విజయకుమార్ నాయుడు, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ పి.నాగారాజు, ప్రోగ్రాం ఆఫీసర్ వెంకటరత్నం, విజయుడు, శివప్రసాద్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధే సీఎం చంద్రబాబు లక్ష్యం

- విశ్వబ్రాహ్మణ సంక్షేమం, అభివృద్ధికి కృషి
- కార్పొరేషన్ చైర్‌పర్సన్ పార్వతమ్మ


మాట్లాడుతున్న పార్వతమ్మ

కల్లూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధే సీఎం చంద్రబాబు నాయుడు లక్ష్యమని రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కె.పార్వతమ్మ అన్నారు. సీఎం చంద్రబాబు తొలిసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి 30 ఏళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో పార్వతమ్మ సీఎంకు శుభాకాంక్షలు తెలిపారు. కె.పార్వతమ్మ మాట్లాడుతూ మూడు దశాబ్దాల కాలంలో 4 సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రజల అభివృద్ధికి బాటలు వేశారన్నారు. హైదరాబాద్‌ను హైటెక్ సిటీగా మార్చిన ఘనత చంద్రబాబుకు దక్కుతుందన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే సీఎంగా చంద్రబాబు మరో పదేళ్లు కొనసాగాలని ఆమె ఆకాంక్షించారు.

ఉద్యోగుల సహకారం మరువలేం


పదవీ విరమణ పొందిన డీఈఈ రవీంద్రారెడ్డి దంపతులను సన్మానిస్తున్న అతిథులు

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సహకారం మరువలేమని పంచాయతీరాజ్ క్వాలిటీ కంట్రోల్ డీఈఈ రవీంద్రారెడ్డి అన్నారు. గత నెల 31న పదవీ విరమణ పొందిన ఆయనకు మంగళవారం జిల్లా పరిషత్ సమావేశ భవనంలో మంగళవారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమం కర్నూలు డివిజన్ ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మహేశ్వరరెడ్డి అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి పీఆర్ ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మురళీ కృష్ణనాయుడు, సీఈ శ్రీనివాసులు రెడ్డి, విశ్రాంత చీఫ్ ఇంజనీర్లు బి.సుబ్బారెడ్డి, ఏపీపీఆర్ డిప్లమా ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్య క్షుడు కే.రవీంద్ర హాజరై డీఈఈ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో విశ్రాంత ఎస్ఈలు కే.సుబ్రహ్మణ్యం, ఎస్వీ ప్రసాద్, వి.రామచంద్రారెడ్డి, క్వాలిటీ కంట్రోల్ విశ్రాంత ఈఈ నాగేశ్వరరావు, క్వాలిటీ కంట్రోల్ ఈఈ మురహరరెడ్డి, ఎస్ఈ టు పీఏ శ్రీనివాసులు, కర్రెన్న, రమేష్‌కుమార్‌రెడ్డి, ధనిబాబు, ఎం.శేషయ్య పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): పెద్దపాడు సమీపం లో నిర్మిస్తున్న బీరప్ప స్వామి ఆలయానికి నంద్యాల జిల్లా వెలుగోడు మండలం వేల్పనూరు చెందిన తిరుపాలు కుమారుడు కొల్లి శివ రూ.25వేల నగదును మం గళవారం కర్నూలు జిల్లా కురు వ సంఘం అధ్యక్షులు శ్రీనివా సులు, అసోసియేట్ అధ్యక్షులు గుడిసె శివన్న, ప్రధాన కార్య దర్శి ఎంకే రంగస్వామికి అంద జేశారు. కార్యక్రమంలో పెద్ద పాడు ధనుంజయ, పాల సుం కన్న, తిరుపాలు, కేపీ నాగన్న పాల్గొన్నారు.

కోచ్‌కు అభినందనలు

కర్నూలు స్పోర్ట్స్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఇండోర్ స్టేడియంలో ఫెడరల్ ఇంటర్నేషనల్ వాలీబాల్ (ఎఫ్ఐవీబీ) నిర్వహించిన వాలీబాల్ శిక్షణకు కర్నూలు డీఎస్ఏ కోచ్ బి.రాజేష్ ఎంపికయ్యారు. ఆగస్టు 23 నుంచి 27 వరకు హాజరై విజయవంతంగా శిక్షణ పూర్తి చేశాడు. మంగళవారం స్టేడియంలో రాజేష్‌కు డీఎస్‌డీవో భూపతిరావు, విశ్రాంత సెట్కూరు సీఈవో రమణ అభినందనలు తెలిపారు.

రోడ్డు ఇలా.. ప్రయాణం సాగేదెలా..!

- శిథిలావస్థకు చేరిన పెద్దపాడు-లక్ష్మీపురం రోడ్డు
- ప్రమాదకరంగా మారిన కల్వర్టులు
- భయం భయంగా రాకపోకలు
- ఎద్దులబండ్లు, ట్రాక్టర్లు పొలాలకు వెళ్లాలన్నా కష్టమే

కల్లూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దపాడు-లక్ష్మీపురం గ్రామాల మధ్య రహదారి పూర్తిగా ధ్వంసమైంది. ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోక శిథిలమైన రహదారి, వంతెనలపైనే ప్రజలు, రైతులు రాకపోకలు సాగించాల్సిన దుస్థితి. వర్షాకాలంలో ఈ రహదారి, కల్వర్టులపై ప్రయాణం అంటేనే రైతులు, ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిందే..

మరమ్మతులకు నోచుకోక..

పెద్దపాడు నుంచి లక్ష్మీపురం గ్రామానికి వెళ్లే రోడ్డు శిథిలావస్థకు చేరింది. పెద్దపాడు, సల్కాపురం, పందిపాడు, లక్ష్మీపురం గ్రామాల పరిధిలో దాదాపు వెయ్యి ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఆరు కిలోమీటర్ల పొడవైన రోడ్డును 2009లో పెద్దపాడుకు చెందిన ఆర్.చంద్రకళాధర్‌రెడ్డి పట్టుబట్టి వేయించారు. అప్పటి నుంచి 16ఏళ్లుగా రోడ్డు మరమ్మతు పనులు చేయకపోవడంతో ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లు పొలాలకు వెళ్లాలంటేనే ఆందోళన చెందుతున్నారు. పంటలు కోసి ఇంటికి తరలించే క్రమంలో ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లు ఇంటికి చేరే వరకు


ప్రమాదకరంగా దర్శనమిస్తున్న కల్వర్టు


అధ్వానంగా పెద్దపాడు-లక్ష్మీపురం రోడ్డు

రైతులు కష్టాలు వర్ణనాతీతం. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతు పనులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

భారీ వాహనాలు తిరగడంతో..

చెన్నై-సూరత్ ఎక్స్‌ప్రెస్ హైవే పనులు జరుగుతున్న నేపథ్యంలో భారీ వాహనాలు ఈదారిగుండా తిరగడంతో రోడ్డు తీవ్రంగా దెబ్బ తింది. ఎక్స్‌కవేటర్లు, రోడర్లు, టిప్పర్ల రాకపోకలతో రోడ్డు పూర్తిగా పాడైపోయింది. పెద్దపాడు నుంచి లక్ష్మీపురం రోడ్డులో రెండు గోడౌన్లు ఉండగా వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయి. సమీపంలో తిరుమలగిరి టౌన్‌షిప్‌కు వెళ్లాలంటేనే నివాసం ఉంటున్న ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం



పెద్దపాడు నుంచి లక్ష్మీపురం వెళ్లే రోడ్డు మరమ్మతు పనుల కోసం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. 15వ ఆర్థిక సంఘం నిధులు రాగానే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, పంచాయతీరాజ్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రోడ్డు మరమ్మతు పనులు చేపడతామన్నారు. ప్రజలు, రైతులు, రైతు కూలీల సమస్య పరిష్కారం కోసం రహదారి అభివృద్ధి పనులు చేపడతామన్నారు. ● ఆర్.తిరుమలేశ్వరరెడ్డి, స్థానికుడు

నర్సింగ్ సిబ్బంది పనితీరు మారాల్సిందే

- ఇక నుంచి నర్సింగ్ కేర్‌పై తనిఖీలు
- జీజీహెచ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు


హెడ్ నర్సులతో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): వార్డులో నర్సింగ్ సిబ్బంది రోగుల దగ్గరకు వెళ్లడం లేదని, ఇకనైనా వారు తమ పనితీరును మార్చుకోవాలని కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు సూచించారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో మంగళవార హెడ్ నర్సులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆసుపత్రిలో హెడ్ నర్సులు సరిగ్గా పర్య వేక్షణ చేయడం లేదన్నారు. ఇక నుంచి నర్సింగ్ కేర్‌పై వారంలో రెండు రోజులు డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డాక్టర్ పద్మజ, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రీబాయి తనిఖీ చేసి నివేదిక ఇవ్వాలన్నారు. అసలు వార్డులో రోగుల దగ్గరకు నర్సింగ్ సిబ్బంది వెళ్లడం లేదని, చెబుతూ సీసీ కెమెరాలో ఏఎంసీ వార్డును సూపరింటెండెంట్ అందరికీ చూపించారు. అందులో నర్సింగ్ సిబ్బంది ఎక్కడా కూడా కనబడటం లేదని, కేవలం హౌస్ సర్జన్లు మాత్రమే ఉంటారన్నారు. నర్సింగ్ కేర్ బాగుంటే రోగులు 75 శాతం సంతృప్తి చెందుతారన్నారు. సమీక్షలో డిప్యూటీ సూపరింటెండెట్ శ్రీరాములు, సీఎస్ఆర్ఎంవో వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కిరణ్‌కుమార్, హెడ్‌నర్సులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): సీఐటీయూ న్యూసిటీ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం కేకే భవన్‌లో జరిగిన సీఐటీయూ మూడో నగర మహాసభలో 15 మంది ఆఫీస్ బేరర్స్, 36 మంది కమిటీ సభ్యులతో మొత్తం 51 మందితో నూతన నగర కమిటీని ప్రకటించారు. నగర అధ్యక్షుడిగా వై.నగేష్, కార్యదర్శిగా ఆర్.నరసింహులు, కోశాధికారిగా సీహెచ్.సాయిబాబా, ఆఫీస్ బేరర్స్‌గా టి.రాముడు, సుధాకరప్ప, జి.ఏసు, కే ప్రభాకర్‌లను ఎన్నుకున్నారు.

ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

వినాయకుడికి పూజలు చేసిన ఎస్పీ

కర్నూలు కలెక్టరేట్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): గణనాథుడి ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. మంగళవారం కర్నూలు సమాచార శాఖ కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పాత్రికేయ గణపతిని ఎస్పీ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అనంతరం పాత్రికేయ ఉత్సవ గణపతి సమితి సభ్యులు ఎస్పీని సత్కరించారు.


వినాయకుని విగ్రహం వద్ద కుంకుమార్చన చేస్తున్న మహిళలు

జడ్పీలో గణనాథుడికి పూజలు

కర్నూలు న్యూసిటీ: వినాయక చవితి పురస్కరించుకుని జిల్లా పరిషత్ పరిపాలన భవనం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడిని మంగళవారం మహిళలు కుంకుమార్చన తదితర పూజలు చేశారు. కార్యక్రమంలో జడ్పీ మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

నగర పాలకలో అన్నదానం : నగర పాలకలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం వద్ద మంగళవారం అన్నదానం ఏర్పాటు చేశారు. నగర పాలక అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సహకారంతో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కమిషనర్ పి.విశ్వనాథ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రజలకు భోజనాలు వడ్డించారు. అంతకుముందు వినాయకుడికి కమిషనర్ పూజలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, మేనేజర్ చిన్నరాముడు, డీఎస్‌వో కృష్ణమోహన్, సూపరింటెండెంట్ రామకృష్ణ పాల్గొన్నారు.

ఓర్వకల్లు: మండలంలోని సోమయాజుల పల్లె గ్రామంలో ఏడో రోజు మంగళవారం వినాయకునికి పూజలు చేశారు. వినాయకునికి కాయ కర్పూరాలు సమర్పించారు. భజన మండళ్ల సభ్యులు భజనలు, భక్తి పాటలతో ఆకట్టుకున్నారు. గురువారం వినాయకున్ని కాల్వబుగ్గ మిని రిజర్వాయరులో నిమజ్జనం చేయనున్నట్లు కమిటీ సభ్యులు తెలి పారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.


వినాయకుడి పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పీ విక్రాంత్ పాటిల్


సోమయాజులపల్లెలో వినాయకుడికి పూజలు చేస్తున్న భక్తులు

ఎరువులు అధిక ధరకు విక్రయిస్తే చర్యలు

కోడుమూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఎరువులు, యూరియాను రైతులకు అధిక ధరకు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ డీవై స్వామి డీలర్లను హెచ్చరించారు. పట్టణంలోని పలు ఎరువుల దుకా ణాలపై మంగళవారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఎస్ఐ మాట్లా డుతూ ఎమ్మార్పీకంటే అధిక ధరలకు యూరియాను విక్రయించి రైతులను మోసం చేస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న ఎస్ఐ డీవై స్వామి

సురవరం సంస్మరణ సభను జయప్రదం చేయాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య


మాట్లాడుతున్న గిడ్డయ్య

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ పూర్వ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ పార్లమెంటు సభ్యుడు సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య తెలిపారు. మంగళవారం సీఆర్ భవన్‌లో ఏర్పా టు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 5న జిల్లా పరిషత్ సమావేశ భవనంలో నిర్వహించే సంస్మరణ సభకు ముఖ్యఅతిథిగా జాతీ య కార్యదర్శి కె.నారాయణ హాజరవుతారన్నారు. ఈ సభకు సీపీఐ శ్రేణు లు, వామపక్ష నాయకులు హాజరు కావాలని కోరారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్.మునెప్ప, లెనిన్ బాబు, జిల్లా కార్యవర్గసభ్యుడు కె.జగన్నాథం, నాయకులు రామకృష్ణ, మనోహర్ మాణిక్యం పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

గూడూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసా యాధికారి దస్తగిరిరెడ్డి సూచించారు. మంగళవారం గూడూరు పట్టణంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పత్తి పంటలో గులాబి రంగు పురుగు నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. రసం పీల్చు పురుగుల సమగ్ర సస్యరక్షణ, పంట నమోదు ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సుజాతమ్మ, నాగ సరోజ, రైతులు పాల్గొన్నారు.

కోడుమూరు: పట్టణ సమీపంలోని పంట పొలాల్లో మంగళవారం మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని చేపట్టారు. ఏవో మాట్లా డుతూ ప్రస్తుతం పత్తి పంటకు రసాయనిక ఎరువులను వాడొద్దన్నారు. కాయ నుంచి పత్తిని తీసేటప్పుడు గ్రేడింగ్ చేసుకోవాలన్నారు.

డీఎస్సీ అభ్యర్థుల అనుమానాలను నివృత్తి చేయాలి: డీవైఎఫ్ఐ

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ అభ్యర్థుల అనుమానాలను నివృత్తి చేయాల్సిన అవసరం ప్రభుత్వానికి ఉందని డీవైఎఫ్ఐ రాష్ట్ర కోశాధికారి నగేష్ అన్నారు. మంగళవారం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో కొంతమంది అభ్యర్థులను సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు పిలవలేదని, వారి తరువాత స్థానంలో ఉన్న అభ్యర్థులను పిలిచారని అన్నారు. బీసీ-బీ రిజర్వేషన్ 2,630 ర్యాంకు వచ్చిన మహిళకు వెరిఫికేషన్ కంప్లీట్ చేశారని, అంతకంటే ముందు వరుసలో ఉన్న వారిని పిలవలేదని అన్నారు. అలాగే బీసీడీ రిజర్వేషన్లు కూడా ఇదే పద్ధతిలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరిగినట్లు తెలుస్తుందన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, కార్యదర్శి అబ్దుల్లా, సహాయ కార్యదర్శి ప్రకాష్ పాల్గొన్నారు.

బాలికలు పోషకాహారం తీసుకోవాలి

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కౌమార దశలో బాలికలు పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవాలని కమ్యూనిటీ మెడిసిన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అరుణ అన్నారు. జాతీయ పోషకాహార వారోత్సవాల సందర్భంగా కర్నూలు మెడికల్ కాలేజీ కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో పెద్దపాడు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి హెచ్ఎం హరిత అధ్యక్షత వహించగా.. ముఖ్యఅతిథిగా కమ్యూనిటీ మెడిసిన్ అసోసియేట్ ప్రొఫెసర్ డా.అరుణ పాల్గొని మాట్లాడారు.

ఘనంగా డిప్యూటీ సీఎం జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కల్లూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలు నగరంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం చెన్నమ్మసర్కిల్లో ఉమ్మడి జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు చింతా సురేష్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన డిప్యూటీ సీఎం జన్మదిన వేడుకలకు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్‌యాదవ్, పాణ్యం వాణిజ్య విభాగం అధ్యక్షుడు బి.నాగిరెడ్డి, ఏపీ వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ మంజునాథ్, జనసేన నాయకులు పీబీవీ.సుబ్బయ్య, జగదీష్‌నాయుడు, షబ్బీర్ పాల్గొన్నారు.

కోడుమూరు: ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు మంగళవారం కోడుమూరులో ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పవన్ అభిమానులు రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఆకెపోగు రాంబాబు, శ్రీకృష్ణ, వినోద్, దర్శి, విజయ్ పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

కల్లూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి) ప్రజారోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. మంగళవారం మాధవీనగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆమె లబ్ధిదారుడు బోయ జయన్నకు రూ.43,092వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. మస్తాన్‌నాయుడు, విజయ్‌నాయుడు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

గూడూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): గూడూరు పట్టణానికి చెందిన బోయ రామచంద్రుడికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.40,541 వేల చెక్కును కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అందజేశారు. మంగళవారం కర్నూలు పట్టణంలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బోయ రామచంద్రుడిని ఎమ్మెల్యే పరామర్శించారు. బోయ రామచంద్రుడు అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స చేయించుకునేందుకు అవసరమైన డబ్బులను మంజూరు చేయించాలని ఎమ్మెల్యేను విజ్ఞప్తి చేయగా.. సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.40,541 వేలు మంజూరు చేయించిన చెక్కును బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా బాధితుడు సీఎం చంద్రబాబు, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ విష్ణువర్దన్ రెడ్డి, ఎమ్మెల్యే దస్తగిరికి కృతజ్ఞతలు తెలిపారు.


బాధితుడికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి

ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక గణేష్ నగర్‌లోని హారిజోన్స్ ఇంటర్నేషనల్ ప్లే స్కూల్‌లో మంగళవారం గ్రాండ్ పేరెంట్స్ డేను చైర్మన్ ప్రదీప్ కుమార్, డైరెక్టర్ కే.పావని ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. వివిధ రకాలైన ఆటల పోటీలను నిర్వహించారు.

వైఎస్సార్‌కు ఘన నివాళి

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతిని నగరంలో వైసీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి స్టేట్‌బ్యాంక్ కూడలిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. డిప్యూటీ మేయర్ అరుణ, మాజీ ఎమ్మెల్యే మణిగాంధీ, సీనియర్ నాయకుడు అహ్మద్ అలీఖాన్, కార్పొరేటర్లు మునె మ్మ, రాజేశ్వరరెడ్డి, వాసు పాల్గొన్నారు.

కల్లూరు: దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. 30వ వార్డు షరీన్‌నగర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్పొరేటర్లు, వైసీపీ నాయకులు పాల్గొన్నా రు.

● వైఎస్సార్ వర్ధంతిని పురస్కరించుకుని పెద్దటేకూరులో హనుమంతరెడ్డి ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కాటసాని హాజరయ్యారు. వైసీపీ మండల కన్వీనర్ ఎద్దుల రామకృ ష్ణా రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, కేశవరెడ్డి, అశోక్‌రెడ్డి, సల్కాపురం మద్దిలేటి పాల్గొన్నారు.

కర్నూలు అర్బన్: జన హృదయ నాయకుడు డాక్టర్ వైఎస్ రాజశే ఖరరెడ్డి అని సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ జిలానీ బాషా అన్నారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైఎస్ రాజశేఖ రరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి మూలింటి మారెప్ప, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌బాబు, అనంతరత్నం మాదిగ, ఖాజా హుస్సేన్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు బి.బ్రతుకన్న పాల్గొన్నారు.

కోడుమూరు: పట్టణంలోని హేమాద్రి కాంప్లెక్స్‌లో మంగళవారం వైఎస్ఆర్ వర్ధంతి నిర్వహించారు. వైసీపీ నాయకులు వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జడ్పీటీసీ రఘు నాథ్‌రెడ్డి, వైసీపీ నాయకులు రమేష్ నాయుడు, రవికుమార్‌రెడ్డి, మల్లారెడ్డి, రవి, ప్రవీణ్, లింగమయ్య, లింగ మూర్తి పాల్గొన్నారు.

ఓర్వకల్లు: మండల కేంద్రమైన ఓర్వకల్లులో దివంగత మాజీ ముఖ్య మంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జడ్పీటీసీ సభ్యుడు రంగనాథ గౌడు, నాయకులు శంకర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, వెంగన్న, నాగతిరు పాలు, పాల మధుసూదన్ పాల్గొన్నారు.

ఆదోని

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు

ప్రజల తలరాతను మార్చిన చంద్రబాబు

● సీఎంగా బాధ్యతలు చేపట్టి 30 ఏళ్లు



క్షీరాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు

ఆదోని, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీఎంగా 30 ఏళ్ల క్రితం ఇదేరోజు చంద్రబాబు ప్రమాణం చేసి తెలుగు ప్రజల తలరాతలను మార్చారని మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని మండిగిరి కాలనీలో వార్డు ఇన్‌చార్జి శ్రీనివాస్‌ఆచారి ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ 'చంద్రబాబు అనే నేను అంటూ' తొలిసారి 1995 సెప్టెంబర్ 1వ తేదీన ఉమ్మడి రాష్ట్ర సీఎంగా ప్రమాణ స్వీకారం చేసి సంస్కరణలకు శ్రీకారం చుట్టారన్నారు. హైదరాబాద్‌లో హైటెక్ సిటీ, సైబరాబాద్, శంషాబాద్ ఎయిర్‌పోర్ట్, మెట్రోరైలు, ఔటర్ రింగ్ రోడ్డుకు రూపకల్పన చేసి హైదరాబాద్ రూపురేఖలు మార్చేశారని గుర్తు చేశారు. రాష్ట్ర విభజన అనంతరం క్లిష్ట సమయంలో సీఎంగా బాధ్యతలు చేపట్టి రాజధాని లేని రాష్ట్రాన్ని పాలించారని, 2024లో తిరిగి సీఎం అయ్యాక సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. రాయలసీమను పారిశ్రామిక కేంద్రంగా మార్చేందుకు కృషి చేస్తున్నారన్నారు. సాది కాబేగం, రామస్వామి, తిమ్మప్ప, లక్ష్మీనారాయణ, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటచౌదరి, మారుతినాయుడు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యం



మద్దికెరలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

మద్దికెర, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని వైద్యాధికారులు శ్రీలక్ష్మి, రాగిణి సూచించారు. మంగళవారం పోషకాహార మహోత్సవాలపై అవగాహన పెంచేందుకు ర్యాలీ నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, ఐదేళ్ల పిల్లలందరికీ పోషకాహార ప్రాముఖ్యత, సంతులిత ఆహారంపై అవగాహన కలిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌వో నిరంజన్‌బాబు, వైద్యసిబ్బంది అక్బర్‌బాషా, క్రిష్ణమ్మ, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలూ ముఖ్యమే

● భారత మహిళా జట్టు క్రికెటర్ అంజలి శర్వాణి



అంజలిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ముఖ్యమేనని భారత మహిళా క్రికెట్ క్రీడాకారిణి అంజలి శర్వాణి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఆరెకల్లు జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్రీడలపై అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తాను చదువుతూనే ఓవైపు క్రికెట్‌పై ఆసక్తి పెంచుకొని జాతీయ జట్టులో స్థానం సంపాదించుకున్నానన్నారు. హెచ్‌ఎం ఉషారాణి ఉపాధ్యాయులు మహేంద్ర అంజలిని సన్మానించారు.

విద్యతోనే ప్రగతి



ఉద్యోగాలు సాధించిన వారిని సన్మానిస్తున్న హెచ్‌ఎం

దేవనకొండ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే ప్రగతి సాధ్యమని జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార్ కమిషన్ సభ్యుడు నరహరి నారాయణరెడ్డి అన్నారు. డీఎస్సీలో 21 ఉద్యోగాలు సాధించిన తెర్నేకల్ యువతి, యువకులను వివేకనంద పాఠశాలలో హెచ్‌ఎం కోటేష్ సన్మానించారు. దేశ భవిష్యత్ టీచర్ల చేతులోనే ఉందని, విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించి, వారిలో ప్రతిభను వెలికితీయాలన్నారు. మాజీ సర్పంచ్ బి. రాజన్న, మాజీ ఉపసర్పంచులు సత్యరాజు, తలారి చెన్నప్ప, ఆదోని రాముడు, బరుకు మాదన్న, తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి



చెరుకులపాడులో పత్తిని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

వెల్దుర్తి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పత్తిలో పురుగు ఉధృతిని అరికట్టడానికి రైతులు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తలు వెంకటరమణమ్మ, రమాదేవి, నసీరుద్దీన్ సూచించారు. మంగళవారం ఏవో అక్బర్‌బాషా ఆధ్వర్యంలో చెరుకులపాడు, నార్లాపురం, మల్లెపల్లి, వెల్దుర్తి గ్రామాల్లో పత్తి, కంది, ప్రొద్దుతిరుగుడు పంటలను పరిశీలించారు. పత్తిలో పచ్చదోమ, గులాబీ పురుగు, ప్రొద్దుతిరుగుడలో తెగులు నివారణకు రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు.

గుర్తుండిపోయే నాయకుడు హరికృష్ణ



నివాళి అర్పిస్తున్న నాయకులు

ఆదోని, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, రాజ్యసభ మాజీ సభ్యుడు నందమూరి హరికృష్ణ ప్రజలకు గుర్తుండిపోయే నాయకుడని తెలుగు యువత కార్యదర్శి వెంకట్‌చౌదరి, మారుతినాయుడు అన్నారు. మంగళవారం ఆదోనిలో 69వ జయంతి నిర్వహించారు. రాజకీయ నాయకుడిగా, నటుడిగాప్రతిభ కనబరిచాడన్నారు. శ్రీనివాస ఆచారి, రామస్వామి, లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీటీసీ శేఖర్ పాల్గొన్నారు.

జీతాలు ఇవ్వండి సారూ..!

● తొమ్మిదినెలల నుంచి ఇవ్వడం లేదు ● ఎలా బతకాలి అని ప్రశ్నిస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులు



మద్దికెరలో విధులు నిర్వహిస్తున్న కార్మికురాలు

మద్దికెర, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): తొమ్మిది నెలలుగా తమకు జీతాలు ఇవ్వకపోతే ఎలా బతకాలని స్వచ్ఛభారత్ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో 15 మంది ఉండగా వారికి జీతాలు ఇస్తున్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్వచ్ఛభారత్ కింద మరో 18 మంది కార్మికులు పని చేస్తున్నారు. మద్దికెరలో 20వేల జనాభా ఉండగా, 18 వార్డులు ఉన్నాయి. రోజూ చెత్తను సేకరించి, చెత్త నుంచి సంపద కేంద్రాలకు తరలిస్తున్నామని జీతాలు చెల్లించాలని కోరుతున్నారు.

ప్రభుత్వ నిధులు రాలేదు



పంచాయతీలో నిధుల కొరత ఉంది, ప్రభుత్వం నుంచి నిధులు రాలేదు. స్వచ్ఛభారత్ కార్మికులకు త్వరలోనే జీతాలు ఇచ్చేందుకు బిల్లులు పెడతాం **- శివకుమార్, పంచాయతీ కార్యదర్శి**

వైసీపీ ఎమ్మెల్యేల అసత్య ఆరోపణలు



చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యే

ఆదోని, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎమ్మెల్యేలు కూటమి ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేసున్నారని, ఇది మంచి పద్ధతికాదని ఎమ్మెల్యే పార్థసారథి హితవు పలికారు. మంగళవారం స్థానిక ఇంటర్నేషనల్ ఫంక్షన్‌హాల్‌లో డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలు జనసేన ఇన్‌చార్జి మల్లప్ప ఆధ్వర్యంలో నిర్వహిం చారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ బి.టి.నాయుడు, కురువ కార్పొరేషన చైర్మన్ దేవేంద్రప్ప, మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు, విట్టా రమేష్, గుడిసె కృష్ణమ్మ, భాస్కర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, భూపాల్‌చౌదరి హాజరయ్యారు. అనంతరం మహిళలకు చీరలు పంపిణీ చేసి, అనంతరం రక్తదానం చేశారు. వైసీపీ నాయకులపై ప్రజలు ఓటుతో బుద్ధిచెప్పి 11 సీట్లు మాత్రమే ఇచ్చినా బుద్ధి రాకపోతే ఎలా అంటూ ప్రశ్నించారు. ఈనెల 18న జరగబోయే అసెంబ్లీ సమావేశాలకు వైఎస్ జగన్, వైసీపీ ఎమ్మెల్యేలు హాజరుకావాలని సూచించారు. జనసేన నాయకులు రేణువర్మ, రాజశేఖర్ పాల్గొన్నారు.

'సజ్జ'లో జాగ్రత్తలు తీసుకోవాలి

మద్దికెర, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సజ్జ పంటను ఆశించిన పచ్చ లద్దె పురుగులను నివారించుకోవాలని ఏవో రవి సూచించారు.



పంట నమోదును పరిశీలిస్తున్న ఏవో రవి

మంగళవారం మద్దికెర, ఎం.అగ్రహారం గ్రామాల్లో పంట నమోదును పరిశీలించారు. పురుగు నివారణకు ఎనిసెంట్ మందును ఎకరాకు 24 గ్రాముల చొప్పున 15 లీటర్లలో నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాలని రైతులకు డీఏపీ అందుబాటులో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు ఆనంద్, మాజీ ఎంపీటీసీ శివశంకర్, రైతులు ఉన్నారు.

వైఎస్సార్ సేవలు మరువలేనివి



తుగ్గలిలో నివాళి అలర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి

తుగ్గలి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దివంగత సీఎం వైఎస్సార్ సేవలు మరువలేనివని మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పేర్కొన్నారు. మంగళవారం తుగ్గలిలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆరోగ్యశ్రీ, హంద్రీనీవా కాలువ ఏర్పాటు, ఉచిత విద్యుత్, ఫీజు రీయింబర్స్‌మెంటు పథకాలు అమలుచేశారన్నారు. ఆయన ఆశయాల సాధన కోసమే వైఎస్ జగన్ పోరాడుతున్నారన్నారు. మోహన్ రెడ్డి, జిట్టా నగేష్, జగన్నాథరెడ్డి, గోపాల్ రెడ్డి, హనుమంతు, చంద్రశేఖర్ రెడ్డి ఉన్నారు

ఆదోని టౌన్: దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి 16వ వర్ధంతిని మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు నిర్వహించారు. విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కాంగ్రెస్ ఇన్‌చార్జి రమేష్ యాదవ్, మాజీ కౌన్సిలర్ దిలీప్ ధోకా పట్టణ అధ్యక్షుడు సాయినాథ్, యువజన కాంగ్రెస్ కార్యదర్శి మారుతీరావు, దేవిశెట్టి వీరేష్ పాల్గొన్నారు.

పోలీసులపై దాడిచేసిన వారిని వదిలిపెట్టం: ఎమ్మెల్యే

ఆదోని రూరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పోలీసులు, ప్రభుత్వ అధికారులపై దాడులు చేసేవారిని వదలిపెట్టబోమని ఎమ్మెల్యే పార్థసారథి స్పష్టం చేశారు. గణపతి నిమజ్జనంలో బందోబస్తు విధుల్లో గాయపడ్డ ఇస్వీ హెడ్‌కానిస్టేబుల్ షేక్‌సాబ్‌ను ఆయన మంగళవారం ఆసుపత్రిలో పరామర్శించారు. దాడి వివరాలను సీఐ నల్లప్పను అడిగి తెలుసుకున్నారు.



హెడ్ కానిస్టేబుల్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు : ఆర్డీవో

హాలహర్వి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): డీలర్లు ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని పత్తికొండ ఆర్డీవో భరత్‌నాయక్ హెచ్చరించారు. మంగళవారం గూళ్యంలోని ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. ఎరువులను విక్రయించే రైతుకు బిల్లు ఇవ్వాలని, ఎమ్మార్పీకే ఎరువులు, క్రిమిసంహారక మందులు అమ్మాలన్నారు. తహసీల్దార్ లక్ష్మీనారాయణ ఉన్నారు.



దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఆర్డీవో

సీఐని సస్పెండ్ చేయాలి

ఆదోని టౌన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరులో జరిగిన వినాయక నిమజ్జనం సందర్భంగా భక్తులపై దౌర్జన్యం చేసిన సీఐ శ్రీనివాసులును వెంటనే సస్పెండ్ చేయాలని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు, ఉత్సవ కమిటీ జిల్లా ఉపాధ్యక్షుడు బసవన్న గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం కార్యాలయంలోమాట్లాడుతూ నిమజ్జనానికి విగ్రహాలను తరలించేవారిని సోమప్ప సర్కిల్ వద్ద సీఐ మైకులో వారిని వెధవల్లారా అని సంబోధించడాన్ని ఖండించారు. విట్టా రమేష్, కునిగిరి నీలకంఠ, ప్రతాప్, మలేకర్ శ్రీనివాస్ ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

తుగ్గలి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నాయకులు శ్రీరాములు, గోపాల్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ఆశా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. జీతాలు పెంచి, రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.

అభివృద్ధి కోసం పాటుపడాలి

ఆలూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకులు విభేధాలను పక్కనపెట్టి అభివృద్ధి కోసం పాటుపడాలని జనసేన ఇన్‌చార్జి తెర్నెకల్ వెంకప్ప విమర్శించారు. మంగళవారం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదినం నిర్వహించారు. ఎమ్మెల్యే విరుపాక్షి అసెంబ్లీలో గళం విప్పకుండా పవన్‌కళ్యాణ్‌ను విమర్శించడం తప్పు చేసిందేమీ లేదన్నారు. కురువ కార్పొరేషన్ డైరెక్టర్ ఉద య్, రంజిత్, ఛత్రపతి, సోమశేఖర్, చిరంజీవి, చంద్ర, అశోక్, మున్నా ఉన్నారు.

అంగీకార పత్రం ఇవ్వకుంటే గృహాలు రద్దు

ఆదోని టౌన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అంగీకార పత్రం ఇవ్వని టిడ్కో లబ్ధిదారుల గృహాలను రద్దు చేస్తామని మున్సిపల్ కమిషనర్ కృష్ణ మంగళవారం తెలిపారు. నెలవారి కంతులు చెల్లించేలా బ్యాంకు రుణాలతో గృహాలను పొందిన వారిలో 512 మందికి వివిధ కారణాలతో రుణం మంజూరుకాని జాబితాను సచివాలయాలకు పంపామన్నారు. బ్యాంకు రుణాలతో టిడ్‌కో గృహాలు తీసుకోవడానికి అంగీకరిస్తూ 15 రోజుల్లోగా సచివాలయం లేదా మున్సిపల్ కార్యాలయంలో గాని అంగీకార పత్రం ఇవ్వాలని సూచించారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోండి

వెల్దుర్తి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని శ్రీశైలం ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆదేశించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయ సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాల నేపథ్యంలో పారిశుధ్య పనులు నిర్వహించాలన్నారు. తహసీల్దార్ చంద్రశేఖర వర్మ, ఎంపీడీవో సుహాసినమ్మ, ఏవో అక్బర్‌బాషా, ఏపీవో లక్ష్మన్న ఉన్నారు.

సీఈవోకు సన్మానం

ఆస్పరి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సొసైటీలో సీఈవోగా పనిచేస్తున్న ఎం.రవికుమార్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకుకు పదోన్నతిపై వెళ్తుండడంతో మంగళవారం సిబ్బంది సన్మానించారు. మేనేజర్ రవిప్రకాష్, సూపర్‌వైజర్ సుకూర్, నరసింహులు, లక్ష్మీనారాయణ, హనుమంతరెడ్డి, లక్ష్మన్న, సుధాకర్ పాల్గొన్నారు.

రీ సర్వేతో న్యాయం

మద్దికెర, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రీసర్వేలో రైతులందరికీ న్యాయం చేస్తామని తహసీల్దార్ గుండాల్ నాయక్ అన్నారు. మంగళవారం పెరవలి గ్రామ సచివాలయంలో రీసర్వే పై గ్రామసభ సర్పంచ్ మల్లికార్జున ఆధ్వర్యంలో నిర్వహించారు. భూములు, కొలతల్లో తేడాలు వుంటే రైతుల అనుమతితో సరిచేస్తామన్నారు.

సిలిండర్

● వంట గ్యాస్ సిలిండర్ డెలివరీపై అదనపు వసూళ్లు

● చర్యలు తీసుకోవాలని వినియోగదారుల విజ్ఞప్తి



హొళగుంద, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వంట గ్యాస్ ఏజన్సీ నిర్వాహకులు తమ నుంచి డెలివరీ చార్జీల పేరుతో అదనపు వసూళ్లకు పాల్పడుతున్నట్లు వినియోగదారులు ఆరోపిస్తున్నారు. గ్యాస్‌ను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుంటే ఏజెన్సీ వారు ఇంటి వదకు సిలిండర్ సరఫరా చేయాలి, అదనంగా వసూలు చేయకూడదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 30 కి.మీ.ల తక్కువ దూరంలో డెలివరీ చేయడానికి అదనపు చార్జీలు వసూలు చేయకూడదు. కానీ అది హొళగుంద, గ్రామాల్లో నెరవేరడం లేదని ఆరోపణలు ఉన్నాయి. గ్యాస్ సిలిండర్‌పై బిల్లుపై ఉన్న ధర కంటే అదనంగా వసూళ్లు చేస్తున్నారు. గృహ వినియోగ వంటగ్యాస్ సిలిండర్ ధర రూ.916లు ఉండగా డెలివరీ చార్జీల పేరుతో రూ. 980లు వసూ లు చేస్తున్నారు. సిలిండర్‌కు అదనంగా రూ.64ల వరకూ తీసుకుంటు న్నారు. అలాగే సిలిండర్‌ను తూకం వేసి ఇవ్వాల్సి ఉండగా అదికూడా నెరవేరడం లేదు

● తహసీల్దార్ నిజాముద్దీన్‌ను వివర ణ కోరగా బిల్లుపై ధర మాత్రమే వసూలు చేయాలని, అదనంగా తీసుకుంటే ఏజెన్సీపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అదనంగా రూ.64 తీసుకుంటున్నారు



నేను గ్యాస్ సిలిండర్ బుక్‌చేసుకోగా, బిల్లులపై రూ.916 మాత్రమ ఉంది. అదనంగా రూ.64 వసూలు చేసి, మొత్తం రూ.980లు చేశారు. ఇప్పటికే సిలిండర్ ధర అధికంగా ఉంది. అధికారులు స్పందించి అదనపు చార్జీలను అరికట్టాలి **- మహమ్మద్ ఈబాద్, హొళగుంద**

అధికారులు చర్యలు తీసుకోవాలి



మా గ్రామానికి చెందిన వినియోగదారుల నుంచి సిలిండర్ రూ. వెయ్యి తీసుకుంటున్నారు. డెలివరీ చార్జీలు వసూలు చేయకూడదన్నా వినడం లేదు, అధికారులు చర్యలు తీసుకోవాలి**- వెంకటేష్ , కోగిలతోట**

ముళ్లకంప తొలగింపు



ముళ్ల కంపను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

దేవనకొండ, సెప్టెంబరు 2 (ఆంధ్ర జ్యోతి): మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ నుంచి శ్మశానం వద్ద ఉన్న ముళ్లకంపను అధికారులు మంగళవారం తొలగించారు. డంపింగ్‌యార్డు వరకు రోడ్డుకిరువైపులా కంపను తొలగించే పనులను డిప్యూటీ ఎంపీడీవో గోపాల్, సర్పంచు భర్త బండ్లయ్య పర్యవేక్షించారు. సిబ్బంది ఇనాయ్‌తుల్లా, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



చెక్కులను పంపిణీ చేస్తున్న వీరభద్రగౌడ్

ఆలూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి బి.వీరభద్రగౌడ్ అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ రూ.17.64 లక్షల చెక్కులను 31 మంది బాధితులకు పంపిణీ చేశారు. ఆసుపత్రుల్లో చికిత్స పొందినవారికి మానవతా దృక్పథంతో సీఎం చంద్రబాబు మంజూరు చేశారన్నారు. ఎన్నికల హామీలను నెరవేరుస్తూ ప్రజల ఆదరాభి మానాలు పొందుతున్నారని తెలిపారు. కన్వీనర్ అశోక్, గూళ్యం రామాంజినేయులు, రాముయాదవ్, అంజి, కొమ్ము రాజు, కిట్టు, గుండన్న, దేవేంద్ర పాల్గొన్నారు.

బాధితులను ఆదుకుంటాం

ఆస్పరి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): చిగిలి గ్రామంలో మృతిచెందిన బాధిత కుటుంబాలను ఆదుకుంటామని జనసేన ఇన్‌చార్జి వెంకప్ప అన్నారు. మంగళవారం బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున నగదు అందించారు. అరవింద్‌కుమార్ పాల్గొన్నారు.



ఆర్థిక సాయం చేస్తున్న వెంకప్ప

ప్రోత్సాహం అవసరం



క్రీడాకారులతో రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులకు ప్రోత్సాహం అవసరమని రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి నాగరాజు అన్నారు. మంగళవారం పెద్ద తుంబళం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్రీడా దుస్తులను అందజేశారు. క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం వస్తుందన్నారు. బాలికలు క్రీడల్లో రాణిస్తే స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు పొందవచ్చని సూచించారు. హెచ్‌ఎం మారుతి ప్రియ, ఉపాధ్యాయులు సూర్యనారాయణ, పీడీ నరసింహరాజు సావిత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

విధులకు గైర్హాజరైతే చర్యలు

● ప్రత్యేకాధికారి రాధిక



మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి రాధిక

ఆదోని రూరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులు విధులకు గైర్హాజరైతే కఠిన చర్యలు తప్పవని మండల ప్రత్యేకాధికారి, సోషల్‌వెల్ఫేర్ డీడీ బి.రాధిక హెచ్చరించారు. మంగళవారం ఎంపీపీ భవన్‌లో ఎంపీడీవో జనర్ధన్ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులు, ఇతర మండలస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. సచివాలయ సిబ్బంది విధులకు సక్రమంగా రావడం లేదని ఫిర్యాదులు అందుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. క్రమం తప్పక విధులు విదులు నిర్వహించాలని, ప్రజాసమస్యలు పరిష్కరించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రభలకుండా గ్రామాల్లో పారిశుధ్య పనులు చేయాలని సూచించారు.

కార్మికులకు సన్మానం



కార్మికులను సన్మానిస్తున్న నాయకులు

దేవనకొండ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను కూటమి నాయకులు సన్మానించారు. మంగళవారం డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాన్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. పారిశుధ్య కార్మికుడు మాల నాగరాజు కుటుంబానికి రూ.5 వేలు అందజేశారు. 17 మంది మహిళలకు వీరమహిళ సరోజమ్మ పంపిణీ చేశారు. కూటమి నాయకులు ఆకుల వీరేష్, కప్పట్రాళ్ల మల్లికార్జున, వెంకటస్వామిగౌడ్, సర్పంచు బాస్కర్, తిమ్మయ్య, రామాంజినేయలు, ఖలీల్ పాల్గొన్నారు

కేసులు నమోదు చేయాలి: సీపీఐ



కమిషనర్ గంగిరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మున్సిపాలిటీకి చెందిన స్థలాలను కబ్జా చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న అధికారులను డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పార్టీ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా రంగన్న మాట్లాడుతూ పట్టణంలో కోట్ల రుపాలయ విలువైన స్థలాలను కొంతమంది రాజకీయ నాయకులు కబ్జాచేస్తున్నా వారిపై చర్యలు తీసుకోకుండా మున్సిపల్ అధికారులు చోద్యం చూస్తున్నారన్నారు. కోట్లాది రుపాయల విలువ చేసే మున్సిపల్ స్థలాలు కబ్జాకు గురువుతున్నా మున్సిపల్ అధికారులు నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. స్థలాలను కబ్జాచేసిన వారిపై మున్సిపల్ అధికారులు ఉక్కుపాదం మోపాలని లేని పక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో భూ పోరాటం చేసి కబ్జాకు గురైన స్థలాలను ఇళ్ల స్థలాలు లేని నిరుపేదలకు పంచుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జబ్బాజర్, దాదావలి, విజేంద్ర, ఖాజా, నరసింహులు, ఇస్మాయిల్, నాగరాజు, నరసింహా, నబిసాబ్, నరసింహగౌడ్, శివ పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ అమలు చేయాలి

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయాలని ఏపీ కౌలు రైతు సంఘం మండల అధ్యక్షులు అబ్దుల్లా, సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్థానిక శివన్న నగర్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయాలని సెప్టెంబర్ 4వ తేదీన ఆదోని రెవెన్యూ భవన్‌లో జరగబోయే కౌలు రైతుల సదస్సును జయప్రదం చేయాలని కరపత్రాలు విడుదల చేశారు. కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో ఆదోనిలో జరిగే స దస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాష, మోహన్, నరసింహులు, వీరారెడ్డి, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పట్టాలు ఇస్తాం



పట్టాలు పరిశీలిస్తున్న అధికారులు

నందవరం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం పట్టాలు పంపిణీచేస్తుందని తహసీల్దార్ శ్రీనివాసులు. టీడీపీ జిల్లా ఉపాధ్యాక్షుడు దేశాయి మాధవరావు అన్నారు. మంగళవారం నందవరంలో పట్టాలు పంపిణీ చేస్తున్న స్థలంను పరిశీలించారు. ఈ సందర్భంగా దాదాపు 7ఎకరాలు స్థలాలను పట్టాల కోసం గతంలో కేటాయించిందని దేశాయి తెలిపారు. ఇందుకు పట్టాల జాబితా తయారు చేసి అర్హులైన ప్రతి ఒక్కరికి పట్టాలు ఇచ్చేందుకు సిద్దంగా ఉన్నామన్నారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా ఉపాధ్యాక్షుడు దేశాయి మాట్లాడుతూ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరెడ్డి ఆదేశాల మేరకు అర్హులైన అందరికి పట్టాలు ఇచ్చే విధంగా చూడాలని ఆయన అధికారులకు కూడా ఆదేశించారని తెలిపారు. త్వరలో చాకలీ గేరి, కోటా వీధిలో ప్రతి ఒక్కరికి పట్టాలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో బెస్త ఈరన్న, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, మల్లి, నరసింహులు పాల్గొన్నారు.

పనుల్లో ప్రగతి సాధించాలి

గోనెగండ్ల, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రభుత్వం కేటాయించిన గృహాల నిర్మాణాన్ని త్వరిత గతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అందులో ప్రతి మండల అధికారులు ప్రగతి సాధించాలని జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(జిల్లా హౌసింగ్ డిపార్ట్‌మెంట్ హెడ్) టీ. చిరంజీవి కోరారు. మంగళవారం మండల కేంద్రమైన గోనెగండ్లలోని సిమెంట్, స్టీల్ గోడౌన్‌ను ఆయన పరిశీలించారు. ఇందులో సిమెంట్ స్టీల్ స్టాక్ ఎంత ఉందని హౌసింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం లో మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో హౌసింగ్ డిప్యూటీ ఈఈ ప్రసాద్, తహసీల్దార్ రాజేశ్వరి, ఎంపీడీవో మణిమంజరి, ఏపీవో మహమ్మద్‌బాషా, ఆర్ఐ రామయ్య సిబ్బంది పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారుల ఆకస్మిక దాడులు

మంత్రాలయం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుంగభద్రలో ఎరువుల దుకాణాలపై కర్నూలు విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా దాడులు చేశారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎరువులు, పురుగు మందులు అధిక రేట్లకు, కర్ణాటక రాష్ట్రానికి విక్రయిస్తున్నరన్న ఆరోపణలతో మంగళవారం సాయంత్రం విజలెన్స్ అధికారులు వెంకటప్రసాదు, వెంకట రమణ, ఏఓ జీరా గణేష్, మంత్రాలయం సీఐ రామాంజులు, మాధవరం ఎస్ఐ విజయ్‌కుమార్ దాడులు నిర్వహించారు. షాపులో అక్రమంగా నిల్వఉంచిన రూ.6.40లక్షల విలువైన 700 వివిధ రకాలబస్తాల ఎరువులను సీజ్ చేశారు. ఆ దుకాణంపై కేసు నమోదు చేసి పంచనామా నిర్వహించి జాయింట్ కలెక్టర్‌కు బదిలీ చేసినట్లు తెలిపారు. తనిఖీలో ఏంపీహెచ్ఈఓ బసవరాజు,వీహెచ్ఏలు రాజేష్, విజయ్ పాల్గొన్నారు.

వేధింపుల కేసు నమోదు

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని లక్ష్మీపేటకు చెందిన గడిగే ప్రీతి (25) వేదింపులకు తాళలేక పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సీ ఐ శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్బంగా సీ ఐ తెలిపిన వివరాల మేరకు రెండేళ్ళ క్రిత ం ప్రీతి ఎమ్మిగనూరు లక్ష్మీ పేటకు చెందిన విజయ్‌ను పెళ్ళి చేసుకోగా రెండేళ్ళ గడిచినా పిల్లలు కాలేదని అత్తారింటివారు సూటిపోటి మాటలతో మానసికంగా వేధించేవారని, అందరూ కలసి తనను పుట్టింట్లో వ దిలేశారని ప్రీతి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

'ముఖ్యమంత్రివి మోసపూరిత ప్రకటనలు'

నందవరం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు మోసపూరితమైన ప్రకటనలు చేసి ప్రజలను మభ్యపెడుతున్నారని వైసీపీ రాష్ట్ర మేధావుల ఫోరం సంయుక్త కార్యదర్శి లక్ష్మీకాంతరెడ్డి, రాష్ట్ర బీసీసెల్ సంయుక్త కార్యదర్శి విరుపాక్షిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని హాలహర్వి, దర్మాపురం గ్రామాల్లో మాజీ ఎంపీ, నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక ఆదేశాల మేరకు మండలపార్టీ కన్వీనర్ శివారెడ్డి గౌడ్ ఆధ్వర్యంలో బాబు షూరిటీ- మోసం గ్యారెంటీ నినాదంతో ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. అధికారంలోకి వచ్చాకా ఇచ్చిన హామీలు విమర్శిస్తున్నాడని వారు ఆరోపించారు. అనంతరం రైతులు నష్టపోయిన పంటలను పరిశీలించారు

అధ్వాన స్థితిలో మంత్రాలయం రోడ్లు

● రోడ్లు వేసినా మూనాళ్ల ముచ్చటే.. ● కోతకు గురైనా పట్టించుకునే వారే లేరు ● నిర్లక్ష్యంగా అధికారులు



రచ్చుమర్రి వద్ద గుంతగా మారిన రోడ్డు



బూదూరు వద్ద కోతకు గురైన రహదారి

మంత్రాలయం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారాయి. మాధవరం నుంచి ఆదోని వెళ్లే దారిలో పెద్దపెద్ద గుంతలు పడి ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. అదే విధంగా మాధవరం నుంచి సూగూరుకు వెళ్లే దారిలో రోడ్డు గుంతలమయంగా మారింది. అదే విధంగా బూదూరు నుంచి చిలకలడోనకు వెళ్లే రోడ్డులో దాదాపు 40 శాతం రోడ్డు కోతకు గురైంది. తిమ్మాపురం, చౌలహల్లి గ్రామాల రోడ్లు కోతకు గురై ఎప్పుడు కూలిపోతాయో.. ప్రమాదాలకు గురవుతామో అని ప్రజలు భయం భయంగా ప్రయాణాలు సాగించాల్సిన దుస్థితి. ఈ ప్రాంతాల్లో అధికంగా వాహనాల రాకపోకలు సాగిస్తున్నారు. ఆదమరిస్తే ప్రమాదానికి గురి కావాల్సిందే. ఈ కోతకు గురైన రోడ్లలో రాత్రివేళలో కొత్తవారు ప్రయాణిస్తే గుంతలో పడటంతో.. గత రెండు వారాల్లో ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన సంఘటనలు కూడా ఉన్నాయి. సూగూరు నుంచి కల్లుదేవకుంటకు వెళ్లే గ్రామం మధ్యన రోడ్డు భారీ ఎత్తున కోతకు గురైంది పట్టించుకోవాల్సిన ఆర్అండ్‌బీ అధికారులు ఈ రోడ్లపై కనెత్తి చూడడం లేదని వాపోతున్నారు. రైతులు, వివిధ గ్రామాల నుంచి రాకపోకలు సాగించే వాహనాలదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం

మాధవరం నుంచి ఆదోనికి వెళ్లే రోడ్డు మరమ్మతులు చేపడుతున్నాం. కోతకు గురైన రోడ్లు పునర్నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాం. నిధులు రాగానే పనులు చేపడతాం. వర్షాలు పడటంతో రోడ్లపై నీరు నిలిచి బీటీ రోడ్డు తార్ లేచి పోయి గుంతలు పడుతున్నాయి. అధిక వర్షాలతోనే ఈ దుస్థితి ఉంది. పొలాల్లోని నీరు కాలువల ద్వారా బయటకు రోడ్డుపై పారడంతో రోడ్లు కోతకు గురవుతున్నాయి. త్వరలో మరమ్మతులు చేపట్టి రాకపోకలు సరిదిద్దుతాం.

● నాగరాజు, డీఈ, ఆర్అండ్‌బీ, ఎమ్మిగనూరు

ఉల్లి రైతులకు అండగా ప్రభుత్వం

● ఎమెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

గోనెగండ్ల, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఉల్లి రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం గోనెగండ్ల లోని ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన పరిశీలించారు. సమస్యలను వైద్యురాలు రంగారవళిని అడిగి తెలుసుకున్నారు. 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని వైసీపీ ప్రభుత్వం ఆరు పడకల ఆసుపత్రిగా మార్చిందన్నారు. గోనెగండ్ల ప్రభుత్వ ఆసుపత్రికి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తామన్నారు. సమస్యను సీఎం, ఆరోగ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి ఎంసీహెచ్ ఆసుపత్రిగా మార్చడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసీపీ నాయకులు ఉల్లి రైతులపై కపటి ప్రేమ వల్లబోస్తున్నారని ఆయన ఎద్దేవ చేశారు. . ప్రస్తుతం ఉల్లి క్వింటం ధర రూ. 1200 పలుకుతోందన్నారు.

అర్హత ఉన్నవారి పింఛన్ తొలగించరు: ఎమ్మెల్యే అర్హత ఉన్న వారి పింఛన్‌లను కూటమి ప్రభుత్వం తొలగించదని ఎమ్మెల్యే బీవీ అన్నారు. కొంత మంది అర్హత లేక పోయినప్పటికి పింఛన్లు పొందుతున్నట్లు ప్రభుత్వకు సమాచారం అందడంతో రివెరిఫికేషన్ మాత్రమే చేశారు అంతే తప్ప ఎవ్వరి పింఛన్ తొలగించలేదన్నారు. వైసీపీ వారు ఏమి మాట్లడాలో తెలియక ప్రజలను, వికలాంగులను తప్పదోవ పట్టిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తిరుపయ్యనాయుడు, రామాంజినేయలు, బేతాలబడేసా, తిమ్మారెడ్డి, మహాల్ రహంతుల్లా, నూరహమ్మద్, కాంట్రాక్టర్ షేక్షావలి, మల్లయ్య గౌండ రహంతుల్లా, అచ్చుకట్ల ఫక్రుద్దీన్, నజీర్‌సాహెబ్, టీడీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సుందర మంత్రాలయంగా తీర్చిదిద్దడమే లక్ష్యం



పరిసరాలను శుభ్రం చేస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): భక్తులకు మెరుగైన సౌకర్యాలతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం అందించి స్వచ్ఛ సుందర మంత్రాలయంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు అన్నారు. మంగళవారం కర్ణాటక రాష్ట్ర విద్యా శాఖ మంత్రి అరవింద్ లింబావలి ఆధ్వర్యంలో వంద మంది వలంటీర్లతో మంత్రాలయం చేరుకున్నారు. యోగీంద్ర కళా మండపం నుంచి స్వచ్ఛ సుందర మంత్రాలయంగా శుభ్రం చేసేందుకు ఆయా పనులను పీఠాదిపతి సుబుధేంద్రతీర్థులు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బెంగళూరు నుంచి దాదాపు వంద మంది వలంటీర్లు, క్రమశిక్షణ, పనుల పట్ల ఏకాగ్రతతో ఉండి మంత్రాలయం శుభ్రం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బేజేపీ బెంగళూరు అధ్యక్షుడు సుబ్బన్న, పిల్లప్ప, మఠం మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, సురేష్ కోనాపూర్, శ్రీపతాచార్, ఐపీ నరసింహమూర్తి, అనంతపురానిక్, జేపీ స్వామి, ద్వారపాలక అనంతస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న ఏవో, ఎస్ఐ

ఎమ్మిగనూరు, సెప్టెంబర్ 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎరువుల దుకాణంలో మంగళవారం వ్యవసాయ, పోలీసు శాఖల అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఏఓ శివశంకర్ తెలిపిన వివరాల మేరకు.. స్థానికంగా ఉన్న ఓ పెస్టిసైడ్స్ దుకాణంలో పట్టణ ఎస్ఐ మధుసూదన రెడ్డితో కలిసి తనిఖీలు నిర్వహించగా జీరో ఫారం ఇన్‌క్లూడ్ చేయకుండా ఎరువుల విక్రయాలు చేస్తుండటాన్ని గుర్తించారు. రూ. 6.83లక్షల విలువ చే సే 13.129 మెట్రిక్ టన్నులు ఎరువుల విక్రయాలను నిలిపివేస్తు ఆదేశాలు జారీ చేశారు. రైతులుకు ఎంఆర్పీ ధరలకే ఎరువులు విక్రయించాలన్నారు. యురియాను ఎవరైనా బ్లాక్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రధాన రోడ్డుపై ఉన్న నీటిని తోడేశారు..



చింతకుంట,-పల్లెపాడు రోడ్డులో నిల్వ నీటిని తొలగించిన దృశ్యం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కోసిగి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కోసిగి-చింతకుంట రోడ్డులో వర్షం నీరు బుగేని చెరువులో వెళ్లకుండా గత వైసీపీ ప్రభుత్వంలో నాయకులు మట్టికట్టలు అడ్డు వేయడంతో చింతకుంట పల్లెపాడు రోడ్డులో నీళ్లు నిల్వగా చేరి వాహనదారులకు, ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతుంది. మంగళవారం ఆంధ్రజ్యోతిలో వైసీపీ పాపం.. ప్రజలకు శాపం కథనానికి స్పందించిన మైనర్ ఇరిగేషన్ అధికారులు చింతకుంట, పల్లెపాడు రోడ్డుపై నిల్వ ఉన్న వర్షపు నీటిని మోటార్ల ద్వారా చెరువులోకి మళ్లించారు. గత వైసీపీ నాయకుల తీరుతో గత రెండు నెలల నుంచి వర్షం నీటితో చింతకుంట, పల్లెపాడు ప్రజలు కోసిగ ప్రజలు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి చెరువుకు అడ్డంగా ఉన్న మట్టి కట్టలను తొలగించి యధావిదిగా వర్షం నీరు చెరువులోకి వెళ్లేలా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు

మంత్రాలయం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం నియోజకవర్గంలో జనసేన పార్టీ బలోపేతం కోసం ప్రతి జనసైనికుడు ముందుండి పోరాటం చేయాలని జనసేన మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌చార్జి బి.లక్ష్మన్న అన్నారు. కార్యక్రమంలో జనసేన, బీజేపీ నాయకులు రమేష్, ఏసేబు, రాఘవేంద్ర, అక్బర్, మహాదేవ్, రంగన్న, రాముడు, వీరేష్, నాగరాజు,పెద్ద ఎత్తున నాలుగు మండలాల నుంచి జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గోనెగండ్ల: మండల కేంద్రమైన గోనెగండ్లలో మంగళవారం జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ 55వ పుట్టిన రోజు వేడుకలు జనసేన పార్టీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కౌతాళం: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను మంగళవారం కౌతాళం మండలంలో జనసేన నాయకులు, అభిమానుల మధ్య ఘనంగా జరుపుకున్నారు. ముఖ్యంగా మండల కేంద్రమైన కౌతాళంలో జనసేన పార్టీ నాయకులు రామాంజనేయులు, మహ్మద్‌ల ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన కార్యకర్తలు రాంబాబు, సాయిబన్న, మహదేవ, బసవ, దేవదాసు తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరం ఏర్పాటు చేసిన జనసేన ఇన్‌చార్జి లక్ష్మన్న

'వేటకు వెళ్తే దొంగలుగా చిత్రీకరించారు'

కోసిగి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని రాయచూరు జిల్లా ఎరిగేరి మండలం దేవనపల్లిలో కుందేలు వేటకు శనివారం రాత్రి వెళ్లామని, అయితే ఆ గ్రామానికి చెందిన కొంత మంది యువకులు తమను బంధించి గొర్రెల దొంగలుగా చేశారని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. కోసిగికి చెందిన వీరేష్, పెద్దకడుబూరు మండలం బాపలదొడ్డి గ్రామానికి చెందిన జయకృష్ణ, బసలదొడ్డి గ్రామానికి చెందిన అంజి అనే యువకుడు మంగళవారం కోసిగిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేవనపల్లి గ్రామస్థులు బలవంతంగా తమను దొంగలుగా చిత్రీకరించారని ఆవేదన వ్యక్తం చేశారు. కర్ణాటకలోని ఎరిగేరి పోలీస్ స్టేషన్‌లో దేవనపల్లి గ్రామస్థులపై ఫిర్యాదు చేశామని యువకులు తెలిపారు.

కష్టపడ్డ వారికి పదవులు

● టీడీపీ మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి



ప్రమాణ స్వీకారం చేస్తున్న చింతలగేని నర్సారెడ్డి

కోసిగి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): టీడీపీలో కష్టపడిన వారికి పదవులు ఇంటి తలుపులు తడుతాయని టీడీపీ మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి అన్నారు. మంత్రాలయం నియోజకవర్గం కోసిగి మార్కెట్ యార్డు చైర్మన్‌గా చింతలగేని నర్సారెడ్డి, వైస్ చైర్మన్ బొగ్గుల తిక్కన్నతో పాటు 11 మంది డైరెక్టర్లు మంగళవారం అట్టహాసంగా కోసిగిలోని మార్కెట్ యార్డు కమిటీలో ప్రమాణ స్వీకారం అట్టహాసంగా చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బి.లక్ష్మన్న, టీడీపీ నాయకులు నరవ రమాకాంత్ రెడ్డి, ముత్తురెడ్డి, మండల టీడీపీ అధ్యక్షులు రామిరెడ్డి, గోపాల్ రెడ్డి, సురేష్ నాయుడు, టిప్పుసుల్తాన్, పాల్గొన్నారు.

ఉద్యోగావకాశాలను సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీలో ఉద్యోగ అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని శ్రీమహాయోగి లక్ష్మమ్మవ్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మహబూబ్‌బాషా తెలిపారు. మంగళవారం కళాశాలలో విద్యార్థులకు ఎల్ఐసీలో ఉండే ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నతంగా చదవాలన్నారు. ఎల్ఐసీలో ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మిగనూరు ఎల్ఐసీ మేనేజర్ పులినాయక్, క్రాంతికుమార్, దేవదానం, రాజశేఖర్, తిప్పేస్వామి, మనోరంజన్ పాల్గొన్నారు.

రుణాలు మంజూరు చేయాలి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పీఎం సూర్యఘర్ పథకం, టిడ్కో గృహాలకు రుణాలు మంజూరు చేయాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి అన్నారు.. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో బ్యాంకు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పీఎం సూర్య ఘర్ పథకంలో ఒక యూనిట్ విలువ రూ 2.30 లక్షలు కాగా ప్రభుత్వ సబ్సిడీ రూ 78 వేలు మిగిలిన మొత్తం బ్యాంకు ద్వారా రుణాలు మంజూరు చేయడానికి అధికారులతో చర్చించినట్లు తెలిపారు. దరఖాస్తులు స్వీకరించడానికి మెప్మా ఆర్పీలకు ప్రత్యేక యాప్ ప్రభుత్వం రూపొందించారన్నారు. కార్యక్రమంలో మెప్మా అధికారులు జయవర్ధన్, లలిత, రియాజ్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌కు ఘన నివాళి

మంత్రాలయం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయంలో దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతిని నిర్వహించారు. మంగళవారం వైసీపీ మండల కన్వీనర్ గురెడ్డి భీమిరెడ్డి, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్ సీబీ విశ్వనాథరెడ్డి, కురువ మల్లికార్జున, జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మేకల నారాయణ, జెట్టి వీరేష్, సిద్ద, అమ్రేష్ నాయక్, వీరారెడ్డి, గోరుకల్లుకృష్ణ, హోటల్ పరమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు రూరల్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని ఎమ్మిగనూరు పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వైఎస్‌కు ఘన నివాళి అర్పించారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఎమ్మిగనూరు కో-ఆర్డినేటర్ కాశింవలి, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్‌యాదవ్ ఆధ్వర్యంలో వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు కార్యక్రమంలో లోకేశ్, భాస్కర్, షాకిర్, రఫిక్, అజయ్ పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు టౌన్ : పట్టణంలో దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి నిర్వహించారు. వైసీపీ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు బుట్టా ప్రతుల్, వైసీపీ స్టేట్ సెక్రటరీ ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి, వైఎస్ఆర్ సర్కిల్‌లోని వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రఘు, రాష్ట్ర వీరశైవ లింగాయత్ అధ్యక్షుడు రుద్రగౌడ్, నాగేషప్ప, నరసింహులు, సునీల్, బజారి తదితరులు పాల్గొన్నారు

గోనెగండ్ల: గోనెగండ్లలో దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి వైఎస్ఆర్ పార్టీ నాయకులు మంగళవారం నిర్వహించారు. స్థానిక బస్టాండ్ ప్రాంగణంలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన రాష్ట్రానికి చేసిన సేవలను నాయకులు, కార్యకర్తలు గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మండల వైసీపీ కన్వీనర్ కృష్ణారెడ్డి, వైసీపీ అనుబంధ సంఘాల రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రమోద్‌కుమార్‌రెడ్డి, కాశీవిశ్వనాథ్‌రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు మురళీనాయుడు పాల్గొన్నారు.